నేటి కందం- నేటికి అందం

సంపూర్ణమ్ముగ-కౌలా
లంపూరుకు మనకును గల రసబంధములన్
పెంపొందజేసి మోడీ
యింపుగ ముద మొందజేసె నిరుదేశములన్ !!

(మోడీ కౌలాలంపూర్ లో పర్యటించి రెండు దేశాల మధ్య సంబంధాలను బలోపేతం చేసి రెండు దేశాలూ సంతోష పడేలా చేశారు.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

పడితేనేమి పురపోరుకు
ప్రచారాల బందు తెర
పాకుతుంది వెనుకనుండి
ప్రలోభాల రంగు ఎర.
ప్రజాస్వామ్య గొంతుపైన
పార్టీల గెలుపు ఆట
ప్రజలింకా లొంగిపోతే
ప్రగతి భవిత కూలే కోట.

చురక

-వేల్పుల నారాయణ
9440433475



హైదరాబాద్ మంగళవారం 10-2-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 • Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:149 పేజీలు:6 వెల: రూ.1/-


## ఆయన పైన ఎందుకు చర్యలు తీసుకోరు: కేంద్రానికి సీఎం సూటి ప్రశ్న



హైదరాబాద్, ఫిబ్రవరి 09: తెలంగాణ రాష్ట్రానికి బీజేపీ ఏం చేసిందో చెప్పాలంటూ ఆ పార్టీ అగ్రనేతలను సీఎం రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. 12 ఏళ్లుగా కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం.. రాష్ట్రానికి ఏమైనా ప్రాజెక్టులు ఇచ్చిందా? అంటూ ఆ పార్టీ నేతలను సూటిగా ప్రశ్నించారు. ప్రధాని మోదీని చూసి ఓటేయాలని బీజేపీ నేతలు అడుగుతున్నారన్నారు. కానీ హామీల అమలు గురించి మాత్రం చెప్పట్లేదంటూ బీజేపీ నేతలపై ఆగ్రహం వ్యక్తం చేశారు సీఎం. ఈ మేరకు హైదరాబాద్‌లో సీఎం రేవంత్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉందన్నారు.

భవిష్యత్తును ఆలోచించి రాబోయే ఎన్నికల్లో ఓటు వేయాలంటూ ఓటర్లకు సూచించారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ మనల్ని అవమానిం చారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మనల్ని అవమానించడమే కాకుండా.. మళ్లీ ఓటు వేయాలని ఫడ్నవీస్ కోరారన్నారు. గతంలో జరిగిన జీహెచ్‌ఎంసీ ఎన్నికల ప్రచారంలో.. వరదల్లో మునిగిపోయిన వస్తువులన్నింటినీ తిరిగిస్తామని నాడు.. బండి సంజయ్ హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఆ తర్వాత ఆ వస్తువులకు బీమా ఉంటేనే వస్తాయంటూ ఆయన మాట మార్చారని సీఎం రేవంత్ అన్నారు.

మూసీ నది అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ నిధులు తెచ్చారా.. అంటూ వారిని ఈ సందర్భంగా రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. కానీ లక్షల కోట్ల రూపాయలు ఇచ్చామని వారు చెబుతున్నారని వ్యంగ్యాస్త్రాలు సంధించారు. పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కూడా వారు తేలేదన్నారు. అలాగే హైదరాబాద్ మెట్రో విస్తరణకు కూడా నిధులు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణకు కేటాయించిన సెమీకండక్టర్ ప్రాజెక్టును.. చివరి నిమిషంలో ప్రధాని నరేంద్ర మోదీ ఒత్తిడితో పోరుగునున్న ఆంధ్రప్రదేశ్‌కు తరలించారంటూ రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రు లు కిషన్ రెడ్డి, బండి సంజయ్‌పై సీఎం రేవంత్ నిప్పులు చెరిగారు.

రాష్ట్ర పన్నుల వాటా తప్ప కేంద్రం తమకు ప్రత్యేకంగా ఇచ్చిందేమిటో చెప్పాలంటూ బీజేపీ అగ్రనేతలను నిలదీశారు. ప్రతి రూపాయి ట్యాక్స్‌పై 42 పైసలు తిరిగి ఇవ్వడం జరుగుతుందని గుర్తుచేశారు. కర్ణాటక రూ.16 పైసలు, తమిళనాడు రూ.26 పైసలు మాత్రమే ఇస్తున్నాయని పేర్కొన్నారు. దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తోందంటూ కేంద్రంపై మండిపడ్డారాయన. కుంభమేళాకు వేల కోట్ల రూపాయల నిధులు ఇస్తుంది. కానీ మేడారం జాతర, గోదావరి పుష్కరాలకు మాత్రం నిధులు ఇచ్చేందుకు ముందుకు రాలేదన్నారు. వరదలొచ్చినప్పుడు అదనంగా రూపాయి సాయం కూడా తెలంగాణకు చేయలేదని కేంద్ర వైఖరిని ఎండగట్టారు. ఆ సమయంలో కేంద్రం తరఫున సాయం కోసం ఢిల్లీకి తాము తిరిగామని ముఖ్యమంత్రి గుర్తు చేసుకున్నారు. రాష్ట్రంలో బీఆర్ఎస్ వాళ్లే ఏకచ్ఛత్రాధిపత్యం సాగించారని ఈ సందర్భంగా సీఎం రేవంత్ అన్నారు. గతంలో కీలక పదవులన్నీ కేసీఆర్ కుటుంబం చేతిలోనే ఉన్నాయని విమర్శించారు. ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ పేరు లేకుండా బీజేపీ నేతల ఎన్నికల ప్రచారం ఉండదన్నారు. అసదుద్దీన్ పేరు చెప్పి ఓట్లు అడుగుతున్నారంటూ ఆ పార్టీ నేతలపై ఫైర్ అయ్యారు. అసదుద్దీన్ దుర్మార్గుడైతే ఆయనపై ఎందుకు చర్యలు తీసుకోరంటూ బీజేపీ అగ్రనేతలను సూటిగా ప్రశ్నించారు. ఎంఐఎంను భూతంగా చూపి ఎంతకాలం ఓట్లడుగుతారంటూ బీజేపీ నేతల వైఖరిని ఎండగట్టారు. మత రాజకీయాల ద్వారానే మనుగడ సాధిస్తుందంటూ బీజేపీపై నిప్పులు చెరిగారు.

బీఆర్ఎస్ నేతలు బరి తెగించి మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు రేవంత్ రెడ్డి. తెలంగాణలో ఏర్పడిన దరిద్రానికి కారణం బీఆర్ఎస్ పార్టీనేనని ఉద్ఘాటించారాయన. బీఆర్ఎస్‌ను యాసిడ్‌తో కడిగినా.. ఆ దరిద్రం పోదంటూ ఎద్దేవా చేశారు. ప్రతిపక్ష నేతగా ఏనాడైనా సభకు వచ్చి ప్రజా సమస్యలు ప్రస్తావించారా.. అని కేసీఆర్ వ్యవహారశైలిని ఆయన తప్పుబట్టారు. ప్రభుత్వ సదుపాయాలు తీసుకుంటూ.. సభకు రారా.. అంటూ బీఆర్ఎస్ అధినేతకు చురకలంటించారు. అలాంటి పార్టీకి ఓట్లు అడిగే అధికారం ఉందా.. అని ఆ పార్టీ నేతలనుద్దేశించి ప్రశ్నించారు. ప్రముఖుల ఫోన్లు ట్యాపింగ్ చేసి నగదు వసూలు చేశారని సీఎం ఆరోపించారు.

బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలది విడదీయరాని బంధమని రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. నోట్ల రద్దు, జీఎస్టీకి బీఆర్ఎస్ నేతలు మద్దతివ్వలేదా.. అని ప్రశ్నించారు. పదేళ్లలో ఎన్ని డబుల్ బెడ్రూమ్‌లు ఇచ్చారంటూ బీఆర్ఎస్ నేతలపై ప్రశ్నల వర్షం కురిపించారు. రెండేళ్లలో 4 లక్షల 50 వేల ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తునామని చెప్పుకొచ్చారు. గతంలో జిరాక్స్ సెంటర్లలో ప్రభుత్వ పరీక్షలకు సంబంధించిన పత్రాలు దొరికాయని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.

## ఏ అవసరం ఉన్నా అండగా నిలుస్తా: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



ఖమ్మం, ఫిబ్రవరి 9: ఖమ్మం జిల్లాలోని మధిర మున్సిపాలిటీలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భారీ రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మధిర పట్టణ అభివృద్ధిపై కీలక వ్యాఖ్యలు చేశారు. గత 10 సంవత్స రాలుగా మధిర మున్సిపాలిటీలో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదన్నారు. ప్రజల ఆశీస్సులు, సహకారంతో మధిర మున్సిపాలిటీలోని అన్ని వార్డులను కైవసం చేసుకుంటామని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

మధిర పట్టణ రూపురేఖలను పూర్తిగా మార్చే బాధ్యత తనదేనని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. మధిరలో అండర్ డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేస్తామని, హైదరాబాద్ తరహాలో మోడరన్ మహాప్రస్థానం శ్మశానవాటిక నిర్మాణానికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు. మధిరకు కావాల్సింది రాజకీయాలు కాదని, కేవలం అభివృద్ధి మాత్రమేనని భట్టి విక్రమార్క ఉద్ఘాటించారు. అభ్యర్థుల గెలుపు రాజకీయాల కోసం కాదని.. అభివృద్ధి కోసమే అని చెప్పారు.

అన్ని వర్గాల అభి వృద్ధి కోసం కాంగ్రెస్-టీడీపీ అ భ్యర్థులను గెలిపించాలని కోరా రు.

డబ్బు ప్రధానం కాదని.. అభివృద్ధే ప్రధానమని, వ్యక్తుల కన్నా వ్యవస్థలే ముఖ్యమని డిప్యూటీ సీఎం వివరించారు.

మధిర మున్సిపాలిటీని రాష్ట్రానికి వెూడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దుతామని ఆయన హామీ ఇచ్చారు. ఏ అవసరం ఉన్నా ప్రజలందరికీ అండగా నిలుస్తానని చెప్పారు. విజ్ఞులైన ప్రతి ఒక్కరూ మధిర అభివృద్ధిపై తమ ఆలోచనలు వంచుకోవాలని కోరారు. మహిళలను వడ్డీలేని రుణాలతో స్వయం ఉపాధి వ్యాపారస్తులుగా తీర్చిదిద్దుతామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పేర్కొన్నారు.

## జీవితంలో ఏదీ సులువుగా ఉండదు.. పరీక్షా పే చర్చలో విద్యార్థులతో మోదీ



న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: సాంకేతికత మనం పనిచేసే విధానాన్ని మారుస్తుందని, దాన్ని అర్థం చేసుకుని అవసరానికి తగినట్లుగా వినియోగిం చుకోవాలని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. అంతేగానీ సాంకేతికతే మిమ్మల్ని బానిసలుగా మార్చుకునే పరిస్థితికి వెళ్లొద్దని సూచించారు. 'పరీక్షా పే చర్చ ' రెండో ఎడిషన్‌లో భాగంగా పలువురు విద్యార్థులతో ప్రధాని మాటాడారు.

ఈ సందర్భంగా కెరీర్ పురోగతికి సంబంధించి వారికి విలువైన సూచనలు చేశారు. విద్యార్థులు వెలిబుచ్చిన సందేహాలకు సమధానాలు ఇచ్చారు. క్రమశిక్షణ, ప్రేరణ ఈ రెండింటి లో ఏది ముఖ్యం.. అన్న ప్రశ్నకు.. ఆ రెండింటినీ పోల్చకూడదని అన్నారు. ఎంత స్ఫూర్తి పొందినా ఆచరణలో క్రమశిక్షణ లేకపోతే సత్ఫలితాలు పొందలేరని అన్నారు. సమయపాలన, స్థిరత్వం, స్వీయ క్రమశిక్షణే మన ప్రేరణను అర్థవంతమైన ఫలితాలుగా మారుస్తుందని చెప్పారు.

ఏఐతో ఉద్యోగాలు పోతాయన్న భయాలు నిజమేనా.. అన్న ప్రశ్నకు సాంకేతికత మన పనితీరును మెరుగుపరుస్తుందని చెప్పారు. దాన్ని సరిగ్గా వినియోగించుకుంటే ఏఐకి విద్యార్థులు భయపడాల్సిన పనిలేదన్నారు. టెక్నాలజీతో ఎలా పనిచేయాలన్నది నేర్చుకోవడం చాలా ముఖ్యమని చెప్పారు. జీవితంలో ఏదీ సులువుగా ఉండదన్నారు.

విద్యార్థులకు ఐదు ట్రావెల్ డెస్టినేషన్స్ చెప్పండి.. అని అడుగగా.. ముందు మన సొంత ప్రాంతాలపై దృష్టి పెట్టాలని చెప్పారు. మన జిల్లా, నగరం, రాష్ట్రంలో ఉన్న ముఖ్యమైన ప్రాంతాల జాబితాను రాసుకోవాలన్నారు.


ఆ తర్వాత ఎక్కడికి వెళ్లాలో ఎంచుకోవాలని చెప్పారు. అనంతరం మన సమీపంలో ఉన్న ప్రాంతాల విశిష్టతను తెలుసుకుంటే, అది భవిష్యత్తులో ఎంతో ఉపయుక్తంగా ఉంటుందని తెలిపారు.

మంచి నాయకుడిగా ఎలా మారాలి..అన్న ప్రశ్నకు మన విధివిధానాలకు ఎన్నటికీ భయపడకూడదని చెప్పారు. విధేయత, నిబద్ధతతో పనిచేయాలన్నారు. నిలకడగా సరైన పని చేయడమే నిజమైన నాయకత్వమని చెప్పారు. లీడర్‌షిప్‌నకు ముఖ్యమైన లక్షణం మీ ఆలోచనలను కనీసం 10 మందికైనా స్పష్టంగా తెలియజేయగలడమని అన్నారు.

మెదడు ఆరోగ్యంగా పనిచేయాలంటే కంటినిండా నిద్రపోవాలని ప్రధాని సూచించారు. విద్యార్థులు చదువుతో పాటు జీవితాన్ని కూడా ఆస్వాదించాలని పేర్కొన్నారు. ఆత్మవిశ్వాసంగా ఉండటం చాలా ముఖ్యమని, అప్పుడే అనుకున్న లక్ష్యాలను సాధించగలమని ప్రధాని తెలిపారు.

## 'వీరయ్య నిను మరువదు కోదాడ గడ్డ'

### -సంస్కరణ సభలో జూలూరు గౌరీ శంకర్



నల్గొండ, ఫిబ్రవరి 9: స్నేహం, దాతృత్వం, ప్రేమ, విలువలతో ఎదిగిన చింతల వీరయ్య మరణం విచారకరమని తెలంగాణ సాహిత్య అకాడమి మాజీ చైర్మన్ జూలూరు గౌరీ శంకర్ అన్నారు. విలువలతో ఎదిగిన వీరయ్యను కోదాడ గడ్డ మరిచిపోదన్నారు. సోమవారం స్థానిక గుడిగుంట్ల అప్పయ్య ఫంక్షన్ హాల్ లో వేలాది మంది హాజరైన చింతల వీరయ్య సంస్కరణ సభలో ఆయన మాట్లాడారు.

లక్ష్య సాధన కోసం కఠోర శ్రమ ఏ విధంగా చేయవచ్చునో వీరయ్య జీవితం నుంచి తెలుసుకోవచ్చు అన్నారు. అవకాశాలు, అండదండలు లేని స్థితి నుంచి స్వతంత్రంగా సమర్థతతో ఏ విధంగా ఎదగవచ్చునో వీరయ్య జీవితం ఓ ఉదాహరణ అన్నారు.

ప్రముఖ వైద్యులు డాక్టర్ జాస్తి సుబ్బారావు మాట్లాడుతూ.. ఒక సామాన్యుని అసమాన్య ప్రయాణం ఏ విధంగా ఉందో తెలుసుకోవాలంటే వీరయ్య జీవితం నిదర్శనంగా నిలుస్తుందన్నారు. వీరయ్య మానవ సంబంధాల గూడు అని చెప్పారు. రామానంద తీర్థ గ్రామీణ విద్యాసంస్థ చైర్మన్ నారా కిషోర్ రెడ్డి మాట్లాడుతూ.. మనిషి విశ్వాసం, వాస్తవిక సత్యాలను సృష్టిస్తుందన్నారు. ఎల్బీనగర్ సీఐ కృష్ణంరాజు మాట్లాడుతూ గుమస్తా నుండి రెండు రాష్ట్రాల ధాన్యం వ్యాపారిగా ఎదిగిన వీరయ్య వ్యక్తిత్వం నుండి కొత్త తరం నేర్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సభకు సీనియర్ జర్నలిస్ట్ గంధం బంగారు అధ్యక్షత వహించారు. మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ వీరయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. ఈ సభలో కట్టబోయిన శ్రీనివాస్ యాదవ్, కాన్వాస్ అసోసియేషన్ అధ్యక్షుడు అర్వపల్లి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల ప్రచారానికి తెర

హైదరాబాద్, ఫిబ్రవరి 9: తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల ప్రచారం నేటితో ముగిసింది. ఈ రోజు సాయంత్రం 5:00 గంటకు ప్రచారానికి ఫుల్ స్టాప్ పడింది. బుధవారం అంటే.. ఫిబ్రవరి 11న రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 నగరపాలక సంస్థలకు పోలింగ్ జరగనుంది. అన్ని రాజకీయ పార్టీల నేతలు, అగ్రనేతలు ఈ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా జోరుగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార కార్యక్రమం.. అధికార, ప్రతిపక్ష నేతల మధ్య ఆరోపణ లు-ప్రత్యారోపణలు, విమర్శలు-ప్రతి విమర్శలతో హోరెత్తిపోతోంది.

సోమవారం సాయంత్రం ఎన్నికల ప్రచారం ముగియనుండటంతో.. మైకులు మూగబోయాయి. అగ్రనేతలతో పాటు కేడర్ అంతా ఇంటి బాటపడుతోంది. ఆఖరి రోజు ప్రచారంలో పాల్గొన్న నేతలు.. ప్రజలను తమ వైపునకు తిప్పుకునేందుకు తమ వంతు ప్రయత్నాలు చేశారు. మరో వైపు 11వ తేదీ ఎన్నికల పోలింగ్‌కు సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తోంది. ఈ ఎన్నికల ఫలితాలు ఫిబ్రవరి 13న(శుక్రవారం) వెలువడనున్నాయి.

## హోంగార్డు కుటుంబానికి రూ. 34 లక్షల బీమా అందజేత



హైదరాబాద్, ఫిబ్రవరి 9: విధి నిర్వహణలో ప్రమాదవ శాత్తు మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి పోలీస్ శాఖ, యాక్సిస్ బ్యాంక్ సంయుక్తంగా బీమా పరిహారాన్ని అందజేశా యి. రాచకొండ కమిషనరేట్ పరిధిలో హోంగార్డుగా విధులు నిర్వహించిన ఎం. వెంకటేశ్ గతేడాది ఏప్రిల్ 27న జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు.

హోంగార్డు విభాగంతో యాక్సిస్ బ్యాంక్ కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం, వేతనం అకౌంట్ కలిగిన సిబ్బందికి వర్తించే ప్రమాద బీమా సౌకర్యం కింద రూ. 34 లక్షల పరిహారం మంజూరైంది.

ఈ సందర్భంగా డిజిపి కార్యాలయంలో సోమ వారం ఏర్పాటు చేసిన కార్యక్ర మంలో అడిషనల్ హోంగార్డ్స్ డీజీపీ స్వాతి లక్రా చేతుల మీదుగా చెక్కును మృతుడి భార్య కొడిగంటి స్వాతికి అందజేశారు.

ఈ సందర్భంగా స్వాతి లక్రా మాట్లాడుతూ మృతి చెందిన హోంగార్డు కుటుంబానికి పోలీసు శాఖ తరపున ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. విపత్కర సమయంలో బాధిత కుటుంబానికి సకాలంలో ఆర్థిక సాయం అందించిన యాక్సిస్ బ్యాంక్ యాజమాన్యాన్ని ఆమె అభినందించారు.

ఈ కార్యక్రమంలో యాక్సిస్ బ్యాంక్ వైస్ ప్రెసిడెంట్ రవీందర్ రెడ్డి, బ్యాంక్ ప్రతినిధులు, హోంగార్డ్ రీజియన్ కమాండెంట్ వెంకటేశ్వర్లు, ఏవో సాయి కుమార్ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## స్కూల్ బస్సును ఢీ కొట్టిన ట్రాక్టర్.. ఇద్దరు మృతి, 12 మందికి తీవ్రగాయాలు

వరంగల్, ఫిబ్రవరి 9: జిల్లాలోని పర్వతగిరి మండలం శ్రీనగర్ క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు దుర్మరణం చెందారు. ఓ కుటు ంబం అన్నారం షరీఫ్ దర్గాలో కందూరు చేసుకొని తిరిగి ట్రాక్టర్ లో వస్తుండగా తీగరాజుపల్లికి చెందిన ఓ ప్రైవేట్ స్కూల్ బస్సును ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడడంతో అందులో ఉన్న చిన్నారితో పాటు డ్రైవంమృతి చెందారు. మరో 12 మందికి గాయాలయ్యాయి.ట్రాక్టర్ డ్రైవర్ మద్యంమత్తులో అతివేగంగా నడపడమే ప్రమా దానికి కారణ మని స్థానికులు వివరించారు. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది పిల్లలు ఉండగా, ట్రాక్టర్‌లో 12 మంది ఉన్నట్లు తెలిపారు. స్కూల్ బస్సులో ప్రయాణిస్తున్న పిల్లలకు స్వల్ప గాయాలయ్యాయి.




పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# నులిపురుగులు లేని బాల భారతాన్ని నిర్మించలేమా !

## (10 ఫిబ్రవరి "జాతీయ నులిపురుగుల నివారణ దినం" సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా శిశువులు, కౌమార యువత ఎదుర్కొంటున్న ఒక ప్రధాన అనారోగ్య సమస్యగా నులిపురుగుల సంక్రమణ (వార్మ్ ఇన్‌ఫెక్షన్) వ్యాధులు నిలుస్తున్నాయి. నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ కారణంగా (శిశువు నుంచి 19 ఏండ్ల కౌమార యువత వరకు) పిల్లలు, కౌమార యువతలో రక్తహీనత, మానసిక శారీరక ఎదుగుదల లోపం, పోషకాహారలోపం లాంటి తీవ్రమైన అనారోగ్యాలు కలుగుతున్నాయి.

ఈ సమస్యకు విరుగుడుగా నులిపురుగులను ఔషధ ప్రయోగంతో తొలగించడానికి 'డీవార్మింగ్' లేదా 'నులిపురుగుల నివారణ' వైద్యం అందించబడుతుంది. నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ సమస్య పెరిగినపుడు పిల్లల్లో "సాయిల్ ట్రాన్స్‌మిటెడ్ హెల్మెంథిస్ (ఎస్‌టిహెచ్)" అనే వ్యాధి వస్తుంది. ఈ వ్యాధి వల్ల శరీర అన్ని భాగాలు కూడా ప్రభావితం అయ్యే అవకాశం ఉన్నందున సకాలంలో సరైన నులిపురుగుల నివారణ చికిత్స చేయడం తప్పనిసరి. ఐరాస వివరణ ప్రకారం మూడురకాల నులిపురుగులు (రౌండ్‌వర్మ్, విప్‌వర్మ్, హుక్‌వర్మ్) పిల్లల ఆరోగ్యాన్ని హరించే ప్రయత్నాలు చేస్తున్నాయని తేలింది.

### జాతీయ నులిపురుగుల నివారణ దినం:

నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ కారణంగా దీర్ఘకాలిక ఆరోగ్య సమస్యలు పెరిగి వారి ఆరోగ్యం, విద్య, శ్రేయస్సును ప్రభావితం చేస్తాయి. నులిపురుగుల సమస్యకు సత్వరమే చికిత్స చేయడం తప్పనిసరి అని గమనించిన సాధారణ ప్రజల్లో అవగాహన కల్పించడానికి భారత కేంద్ర ప్రభుత్వం 2015 నుంచి ప్రతి 10 ఫిబ్రవరి రోజున "జాతీయ నులిపురుగుల నివారణ దినం (నేషనల్ డీవార్మింగ్ డే)" పాటించుటతో పాటు ప్రతి ఏడాది 10 ఫిబ్రవరి, 10 ఆగష్టు రోజుల్లో దేశవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలల నేతృత్వంలో ఉద్యమంగా డీవార్మింగ్ కార్యక్రమం చేపట్టడం జరుగుతున్నది. ప్రపంచవ్యాప్తంగా 27 శాతం పిల్లలు/కౌమార యువత నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ సమస్యను ఎదుర్కొంటున్నట్లు ఐరాస గణాంకాలు స్పష్టం చేయడం విశేషం.

### నులిపురుగుల సంక్రమణ మార్గాలు – ప్రధాన రోగ లక్షణాలు:

తీవ్రమైన నులిపురుగుల ఇన్‌ఫెక్షన్‌కు గురైన పిల్లల్లో పెరుగుదల మందగించడం, పోషకాహార లోపం, మానసిక సామర్థ్యం తగ్గడం, విద్యార్జన ప్రభావితం కావడం జరుగుతుంది. కాళ్లకు పాద రక్షలు లేకుండా నేల మీద నడవడం, చేతులు శుభ్రం చేసుకోకుండా భోజనం చేయడం, కలుషిత నీరు తాగడం, పాశ్చరైజ్ చేయని పాలు తాగడం,కూరగాయల్ని శుభ్రంగా కడగకపోవడం, జంతువుల స్పర్శ లాంటి కారణాల వల్ల నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ కలుగుతుందని తెలుసుకోవాలి. నులిపురుగుల ఇన్‌ఫెక్షన్ వల్ల పిల్లలు/కౌమార యువతలో వాంతులు, వికారం, డిసెంట్రీ (విరోచనాలు), డయేరియా, అలసట, ఆకలి మందగించడం, డీహైడ్రేషన్, తరుచుగా మూత్రం రావడం, బరువు తగ్గడం, దురద వేయడం, కడుపు నొప్పి, మలంలో రక్తం పడడం, శారీరక బలహీనత లాంటి రోగ లక్షణాలు కనిపిస్తాయి.

### నులిపురుగుల నివారణ మార్గాలు:

భోజనానికి ముందు పిల్లలు తమ చేతులను శుభ్రం చేసుకోవడం, సురక్షిత నీరు తాగడం, వేళ్ల గోర్లు తీయడం లేదా మురికిని శుభ్రం చేయడం, మలమూత్ర విసర్జన తర్వాత చేతులు శుభ్రం చేసుకోవడం, నోట్లో చేతి వేళ్లు పెట్టుకోవడాన్ని మానేయడం, చేతి వేళ్ల గోర్లను కొరకడాన్ని మానేయడం, వండిన ఆహార పదార్థాలను కవర్ చేయడం లాంటి పలు జాగ్రత్తలు తీసుకున్నపుడు నులిపురుగుల సమస్యకు తావుండదని గమనించాలి.

2015లో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అతి పెద్ద ప్రజారోగ్య కార్యక్రమంగా ఒకే రోజ "నులిపురుగుల నివారణ" కార్యక్రమాన్ని చేపట్టడంతో మొదలైన ప్రయోగం ప్రతి ఏట 10 ఫిబ్రవరితో పాటు 10 ఆగష్టున కూడా నిర్వహించడం కొనసాగుతున్నది.

ఈ ప్రమాదకర ప్రజారోగ్య సమస్య పట్ల అవగాహన, నివారణ మార్గాలను ప్రచారం చేయడానికి ప్రభుత్వాలతో పాటు ప్రజారోగ్య శాఖ, బాధ్యత కలిగిన పౌర సమాజం, సాధారణ ప్రజానీకం, వైద్య ఆరోగ్య సిబ్బంది, ఇతర సంబంధం ఉన్న సమాజం తమ కర్తవ్యాలను నిర్వహించి భవిష్యత్తులో "నులిపురుగులు లేని బాల భారతాన్ని (వార్మ్ ఫ్రీ భారత్)" నిర్మించుకుందాం.



-ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# రాజ్యాంగంపై అవగాహన, ప్రక్రియలపై పరిజ్ఞానం శాసనసభ్యుల విశ్వసనీయతను పెంచుతాయి: స్పీకర్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: చట్టసభల్లో గౌరవం, హుందాతనం తగ్గడంపై లోక్‌సభ స్పీకర్ శ్రీ ఓం బిర్లా ఆవేదన వ్యక్తం చేశారు. శాసన సంస్థల పవిత్రతను కాపాడాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ, సభ గౌరవ మర్యాదలను కాపాడటం ప్రతి ప్రజాప్రతినిధి ప్రాథమిక బాధ్యత అని శ్రీ బిర్లా అన్నారు. ప్రజాస్వామ్యానికి చట్టసభలు కీలకమని, వాటి గౌరవాన్ని ఎల్లప్పుడూ నిలబెట్టాలని, కాపాడాలని ఆయన అన్నారు. లెజిస్లేటివ్ కార్యకలాపాలలో అంతరాయాలు, క్రమశిక్షణారాహిత్యం చోటుచేసుకోవడంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇటువంటి చర్యలు ప్రజాస్వామ్య సంస్థల ప్రతిష్ఠను దెబ్బతీస్తాయని ఆయన అన్నారు. చర్చలు, హేతుబద్ధమైన వాదనలు, నిర్మాణాత్మక భాగస్వామ్యంపై సభ్యులు ఎక్కువ దృష్టి పెట్టాలని ఆయన కోరారు. విమర్శలు విధానపరంగా, వాస్తవాల ఆధారంగా ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఉండాలని ఆయన పేర్కొన్నారు. క్రమశిక్షణ, నిర్మాణాత్మక విమర్శల ద్వారా సాగే అర్థవంతమైన సభా నిర్వహణ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేస్తాయని స్పీకర్ అభిప్రాయపడ్డారు. బీహార్ శాసనసభ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పాట్నాలో ఈరోజు జరిగిన "సాధికారత కలిగిన శాసనసభ్యులు, బలమైన ప్రజాస్వామ్యం" అనే కార్యక్రమంలో ప్రారంభ ప్రసంగం చేస్తూ శ్రీ బిర్లా ఈ వ్యాఖ్యలు చేశారు.

బలమైన ప్రజాస్వామ్యానికి పునాది చట్టసభ సభ్యులేనని, ప్రజాస్వామ్య వ్యవస్థల ప్రభావం కేవలం రాజ్యాంగ నియమాల మీద మాత్రమే కాకుండా, ఎన్నికైన ప్రతినిధులు తమ బాధ్యతలను ఎంత సమర్థవంతంగా, నిబద్ధతతో నిర్వహిస్తారనే అంశంపై ఆధారపడి ఉంటుందని ఆయన అన్నారు. ఒక శాసనసభ్యుని అసలైన శక్తి ప్రజల నమ్మకం, విశ్వాసం నుంచి వస్తుందని ఆయన పేర్కొన్నారు. ప్రజల సమస్యలను సభలో లేవనెత్తడం, వారి ఆందోళనలను వినిపించడం, చట్టసభల ద్వారా వాటి పరిష్కారానికి కృషి చేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సభ్యులు కీలక పాత్ర పోషిస్తారని ఆయన వివరించారు. శాసనసభ్యుల సాధికారత అనేది ప్రజల అవసరాలను అర్థం చేసుకోవడం, అర్థవంతంగా సభా కార్యకలాపాల్లో పాల్గొనడం, విధాన రూపకల్పనలో నిర్మాణాత్మక పాత్ర పోషించడంపై ఆధారపడి ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ సాధికారతకు నైతిక ప్రవర్తన, బాధ్యత, జవాబుదారీతనం పునాదులని ఆయన వివరించారు. శాసనసభ్యులు ఉన్నతమైన విలువలను పాటించినప్పుడే వారు నిరంతరం ప్రజా ప్రయోజనాల కోసం పని చేయగలరని ఆయన పేర్కొన్నారు. సభ్యులు సాధికారత కలిగి, పూర్తి అవగాహనతో ప్రజల సమస్యల పట్ల స్పందనను కలిగి ఉన్నప్పుడు, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల నమ్మకం, గౌరవం మరింత పెరుగుతాయని ఆయన ఉద్ఘాటించారు.

రాజ్యాంగంపై అవగాహన, సభా నియమాలపై పట్టు ఉన్న సభ్యులు పాలనలో పారదర్శకత, జవాబుదారీతనాన్ని మెరుగు పంచగలరని ఆయన పేర్కొన్నారు. ఒక సమర్థవంతమైన ప్రజాప్రతినిధి ప్రజల ఆశలకు, ప్రభుత్వ విధానాలకు మధ్య ఒక ముఖ్యమైన వారధిలా పనిచేస్తారని ఆయన అన్నారు. శాసనసభ్యులకు సభా నియమాలపై అవగాహన ఉంటేనే వారు తమ అభిప్రాయాలను క్రమబద్ధంగా, తార్కికంగా వినిపించగలరని ఆయన పేర్కొన్నారు. అలాగే, ప్రజా ప్రతినిధి ప్రజల ఆకాంక్ష లకు, ప్రభుత్వ విధానాలకు మధ్య ఒక కీలకమైన వారధిలా పనిచేయాలని ఆయన ఉద్ఘాటించా రు. చర్చలు, కమిటీ పనుల్లో అవగాహనతో పాల్గొనడం ద్వారా శాసనసభ్యులు పాలనలో నాణ్యత ను పెంచుతారని ఆయన పేర్కొ న్నారు. ప్రజాస్వామ్యంలో ప్రజల నమ్మకం అత్యంత విలువైన ఆస్తి అని, సభ లోపల, వెలుపల నిబద్ధతతో కూడిన ప్రవర్తన ద్వారా దానిని కాపాడుకోవాలని ఆయన ఉద్ఘాటించారు.

గ్రామీణ, మారుమూల ప్రాంతాల సమస్యలపై ప్రజాప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన అన్నారు. అలాగే, మహిళలు, యువత ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వ విధానాలు, చట్టాలు ఉండాలని సూచించారు. దేశాభివృద్ధిలో వీరు కీలక భాగస్వాములని, వీరి సమస్యలను చట్టసభల ద్వారా పరిష్కరించినప్పుడే సమ్మిళిత అభివృద్ధి సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు.

బీహార్ శాసనసభలో నేషనల్ ఈ-విధాన్ అప్లికేషన్ (ఎనఈవీఏ) డిజిటల్ హౌస్‌ను ప్రారంభించడం పారదర్శకత, సామర్థ్యాన్ని పెంచే దిశగా ఒక ముఖ్యమైన అడుగు అని ఆయన పేర్కొన్నారు. డిజిటలైజేషన్ వల్ల రికార్డులను సులభంగా పొందవచ్చని, పరిశోధనా సామర్థ్యం పెరుగుతుందని, కాగితంపై ఆధారపడటం తగ్గుతుందని ఆయన వివరించారు. శాసనసభ పనుల్లో డిజిటల్ పరికరాలను సమర్థవంతంగా ఉపయోగించాలని ఆయన సభ్యులకు సూచించారు. అన్ని శాసనసభల ఉమ్మడి కృషితో, ప్రధానమంత్రి పిలుపునిచ్చిన 'ఒకే దేశం, ఒకే శాసన వేదిక' త్వరలోనే నిజం కాబోతోందని ఆయన పేర్కొన్నారు.

భారత ప్రజాస్వామ్య ప్రయాణంలో బీహార్‌కు ఉన్న చారిత్రక ప్రాముఖ్యతను ఆయన గుర్తు చేశారు. ప్రాచీన బీహార్‌లో అమలులో ఉన్న ఉమ్మడి చర్చలు, బహిరంగ వాదనలు, భాగస్వామ్య పాలన వంటి సంప్రదాయాలు నేటికీ ఎంతో సందర్భోచితంగా ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ గడ్డపై పరిఢవిల్లిన ప్రజాస్వామ్య విలువలే నేటి భారత పార్లమెంటరీ వ్యవస్థకు బలమైన సైద్ధాంతిక, నైతిక పునాదిని అందించాయని ఆయన అన్నారు. బీహార్ నిరంతరం రాజకీయ ఆలోచనలకు, నాయకత్వానికి కేంద్రంగా ఉందని ఆయన పేర్కొన్నారు. దేశ రాజకీయ చర్చలను, ప్రజాస్వామ్య సంస్థల ను రూపొందించడంలో ఆ రాష్ట్ర నాయకులు కీలక పాత్ర పోషించారని ఆయన గుర్తుచేశారు. ఈ గొప్ప వారసత్వాన్ని కాపాడటం, దానిని నేటి పాలనకు ఉపయోగ పడేలా చేయడం ప్రజాప్రతి నిధులందరి సమష్టి బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలు, మైనారిటీ వ్యవహారాల మంత్రి శ్రీ కిరణ్ రిజిజు, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ శ్రీ హరివంశ్, బీహార్ శాసనమండలి చైర్మన్ శ్రీ అవధేష్ నారాయణ్ సింగ్, బీహార్ ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ కుమార్ సిన్హా, బీహార్ ప్రభుత్వ పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి శ్రీ విజయ్ కుమార్ చౌదరి తదితరులు సభను ఉద్దేశించి ప్రసంగించారు. బీహార్ శాసనసభ స్పీకర్ డాక్టర్ ప్రేమ్ కుమార్ అతిథులకు స్వాగతం పలికారు. బీహార్ శాసనసభ డిప్యూటీ స్పీకర్ శ్రీ నరేంద్ర నారాయణ్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

# మెడికల్ క్యాంపునకు అనూహ్య స్పందన..



అమరావతి, ఫిబ్రవరి 9: సుజనా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మొబైల్ మెడికల్ క్యాంప్ రెండో రోజు కొనసాగింది..

భావనీపురం 42 వ డివిజన్ హెచ్ బీ కాలనీలో కూడా క్యాంప్ నిర్వహించారు. వందల సంఖ్యలో స్థానికులు వచ్చి వివిధ ఆరోగ్య సమస్యల పై వైద్యులను సంప్రదించి వైద్య సాయం అందుకున్నారు..

క్యాంప్‌లో భాగంగా పీవీఆర్ హాస్పిటల్స్ సిబ్బంది రక్త పరీక్షలు, ఈసీజీ, 2డీ ఎకో, పరీక్షలు నిర్వహించారు..

రోగ నిర్ధారణ అయిన వారికి సుజనా ఫౌండేషన్ మందులను సైతం ఉచితంగా అంద చేశారు..

కార్యక్రమంలో ఎమ్మెల్యే సుజనా చౌదరి కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, సుజనా ఫౌండేషన్ ప్రతినిధులు, సుజనా మిత్ర లు పాల్గొన్నారు.

## లా స్టూడెంట్ ను కాల్చిచంపి... తనూ కాల్చుకొని..

అమరావతి, ఫిబ్రవరి 9: పంజాబ్ రాష్ట్రంలోని తరణ్ తరణ్ లో దారుణం చోటుచేసుకుంది. క్లాస్ రూమ్ లో తోటి విద్యార్థి గన్ తో లా స్టూడెంట్ ను కాల్చి చంపి?ఆ తర్వాత తనను తాను కాల్చుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జరిగింది. లా స్టూడెంట్ ను కాల్చి, ఆ తర్వాత తనను తాను కాల్చుకున్న దృశ్యాలు సీసీ టీవీలో రికార్డయ్యాయి. నిందితుడు ప్రిన్స్ రాజ్ గా గుర్తించారు. మృతిచెందిన విద్యార్థిని సందీప్ కౌర్ గా గుర్తించారు. సీసీ ఫుటేజ్ ను పోలీసులు పరిశీలిస్తున్నారు.

# ప్రపంచంలో అత్యధికంగా భారత సంతతి వారు నివసిస్తున్న దేశాల్లో మలేషియాది రెండో స్థానం.. భారత్, మలేషియా ప్రజల మధ్య బలమైన బంధం: పీఎం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మలేషియాలోని కౌలాలంపూర్‌లో ఇవాళ జరిగిన సామాజిక కార్యక్రమంలో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రసంగించారు. సభకు హాజరైన వారిని ఉద్దేశించి ప్రధానమంత్రి ప్రసంగిస్తూ.. అక్కడ లభించిన ఘన స్వాగతం మన ఉమ్మడి సంస్కృతిలోని అద్భుతమైన వైవిధ్యాన్ని ప్రతిబింబిస్తోందన్నారు. ఈ వేడుకలో పాల్గొన్న తన ప్రియ మిత్రుడు, మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం స్వయంగా విమానాశ్రయానికి వచ్చి తనకు స్వాగతం పలకడమే కాకుండా.. ఆయన కారులోనే ఈ కార్యక్రమానికి తీసుకువచ్చారని శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు. "ఈ ప్రత్యేక మర్యాదలు భారత్‌పై, ఇక్కడున్న ప్రజలపై ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీంకు ఉన్న ప్రేమ, గౌరవాన్ని చాటుతున్నాయి" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

800లకు పైగా నృత్యకారులు ప్రదర్శించిన రికార్డు స్థాయి సాంస్కృతిక కార్యక్రమం రాబోయే కాలంలో చిరస్మరణీయంగా నిలుస్తుందని ప్రధానమంత్రి ప్రశంసించారు. కళాకారులందరికీ అభినందనలు తెలిపారు. తాను ప్రధానమంత్రి కాకముందు నుంచే అన్వర్ ఇబ్రహీం మంచి మిత్రుడని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం చేపడుతున్న సంస్కరణలు, ఆయన అపార మేధస్సు, 2025లో ఆసియాన్ అధ్యక్షుడిగా ఆయన సమర్థవంతమైన నాయకత్వాన్ని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు.

గత ఏడాది ఆసియాన్ సదస్సు కోసం మలేసియాకు రాలేకపోయానని గుర్తుచేసుకున్న ప్రధానమంత్రి, త్వరలోనే వస్తానని ఇచ్చిన మాటను ఇప్పుడు నిలబెట్టుకున్నట్లు తెలిపారు. 2026లో ఇదే తన తొలి విదేశీ పర్యటన అని పేర్కొంటూ, పండుగ వాతావరణంలో ఇక్కడి భారతీయ సమాజంతో కలిసి ఉండటం సంతోషంగా ఉందన్నారు. అందరూ సంక్రాంతి, పొంగల్ సహా తైపూసం వేడుకలను ఎంతో ఉత్సాహంగా జరుపుకున్నారని ఆశిస్తున్నట్లు చెప్పారు. త్వరలో రానున్న శివరాత్రి, రంజాన్ ప్రారంభం సహా హరిరాయ పండుగలను పురస్కరించుకుని ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు కలగాలని ఆయన ఆకాంక్షించారు.

ప్రపంచంలోనే భారతీయ సంతతి ప్రజలున్న రెండో అతిపెద్ద దేశంగా మలేసియా ఉందని, భారత్, మలేసియా ప్రజల హృదయాలను కలిపే అంశాలెన్నో ఉన్నాయని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. తాను కొద్దిసేపటి క్రితం చూసిన ప్రదర్శన ఈ అనుబంధాలను అద్భుతంగా చిత్రీకరించిందన్నారు. "భారత సంతతి ప్రజలు ఇరుదేశాల మధ్య ఒక సజీవ వారధిలా ఉన్నారని కొనియాడారు. మలబార్ పరోటాను పోలి ఉండే రోటీ చనాయ్, కొబ్బరి, సుగంధ ద్రవ్యాలు సహా తేహ్ తారిక్ వంటి రుచులు కౌలాలంపూర్ నుంచి కొచ్చి వరకు ఎంతో సుపరిచితమైనవని, ఇవి మన సాంస్కృతిక బంధానికి ప్రతీకలని" ఆయన వ్యాఖ్యానించారు. ఇరుదేశాల భాషల్లోని సారూప్య పదాలు, మలేసియాలో భారతీయ సినిమాలు, సంగీతానికి ఉన్న ఆదరణ ప్రజల మధ్య అవగాహనను పెంచుతు న్నాయన్నారు. ముఖ్యంగా మలేసియా ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం అద్భుతంగా పాడతారని, దిగ్గజ నటుడు ఎంజీఆర్ తమిళ పాటలను ఆయన ఇష్టపడటం అద్భుతమని ప్రధానమంత్రి అన్నారు.

మలేషియాలోని భారత సంతతి ప్రజల హృదయాల్లో దేశానికి ఒక ప్రత్యేక స్థానం ఉందని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. 2001లో స్వరాష్ట్రమైన గుజరాత్‌లో భూకంపం సంభవించినప్పుడు మలేషియాలోని భారత సమాజం అందించిన సహాయాన్ని గుర్తుచేసుకుంటూ వారికి కృతజ్ఞతలు తెలిపారు. "దేశానికి స్వాతంత్ర్యం తీసుకురావటానికి మలేషియాలోని భారత సమాజానికి చెందిన వేలాది మంది పూర్వీకులు గొప్ప త్యాగాలు చేశారు. వారిలో చాలామంది అంతకుముందు ఎప్పుడూ భారత్‌ను చూడలేదు. అయినప్పటికీ నేతాజీ సుభాష్ చంద్రబోస్ స్థాపించిన 'ఇండియన్ నేషనల్ ఆర్మీలో చేరిన వ్యక్తుల్లో వారు ఉన్నారు" అని శ్రీ నరేంద్ర మోదీ పేర్కొన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ గౌరవార్థంగా మలేషియాలోని భారత సాంస్కృతిక కేంద్రానికి ఆయన పేరును పెట్టినట్లు ప్రధానమంత్రి తెలిపారు. ఈ సందర్భంగా మలేషియాలోని నేతాజీ సర్వీస్ సెంటర్, నేతాజీ వెల్ఫేర్ ఫౌండేషన్ చేస్తున్న కృషిని అభినందించారు.

మలేషియాలోని భారతీయ మూలాలున్న వారు శతాబ్దాలుగా తమ సంప్రదాయాలను కాపాడుకుంటూ వస్తున్నారని ప్రధానమంత్రి పేర్కొన్నారు. తన మన్ కీ బాత్ కార్యక్రమంలో ఈ సమాజం గురించి ప్రస్తావించిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. మలేషియాలోని 500కు పైగా పాఠశాలల్లో భారతీయ భాషల్లో పిల్లలకు విద్యాబోధన చేస్తున్నారని తెలిపారు. "మలేషియాలో తిరువళ్లువర్, స్వామి వివేకానంద వంటి మహాత్ముల ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. బాటు గుహలలో ఇటీవల జరిగిన తైపూసం వేడుకలు అత్యంత దివ్యంగా జరిగాయి. అవి పళనిలో జరిగే ఉత్సవాలకు సమానం" అని శ్రీ మోదీ పేర్కొన్నారు. మలేషియాలో గర్బా నృత్యం కూడా ప్రాచుర్యం పొందిందని చెప్పారు. శ్రీ గురునానక్ దేవ్ జీ బోధనలను ప్రచారం చేస్తున్న సిక్కు సమాజంతో భారత్‌కు ఉన్న సాంస్కృతిక బంధాలను తాము ఎంతో గౌరవిస్తామని ఆయన తెలిపారు.

తమిళ భాష ప్రపంచానికి భారత్ ఇచ్చిన గొప్ప కానుక అని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ కొనియాడారు. తమిళ సాహిత్యం అజరామరమని, తమిళ సంస్కృతి ప్రపంచవ్యాప్తమని, తమిళ ప్రజలు తమ ప్రతిభతో మానవాళికి సేవ చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. "భారత ఉపరాష్ట్రపతి తిరు సీపీ రాధాకృష్ణన్, విదేశీ వ్యవహారాల మంత్రి డాక్టర్ ఎస్ జైశంకర్, ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్, సమాచార, ప్రసార శాఖ సహాయ మంత్రి డాక్టర్ మురుగన్.. వీరంతా తమిళనాడుకు చెందినవారే" అని శ్రీ మోదీ అన్నారు.

మలేషియాలోని తమిళ ప్రవాసులు వివిధ రంగాల్లో సమాజానికి సేవ చేస్తున్నారని, వారు అనేక శతాబ్దాలుగా మలేషియాలో నివసిస్తున్నారని ప్రధామంత్రి గుర్తుచేశారు. ఈ చరిత్ర స్ఫూర్తితో మలేషియా విశ్వవిద్యాలయంలో భారత్ ఇప్పటికే తిరువళ్లువర్ పీఠాన్ని ఏర్పాటు చేసిందని చెప్పారు. ఇప్పుడు మన ఉమ్మడి వారసత్వాన్ని మరింత బలోపేతం చేసేందుకు ఒక తిరువళ్లువర్ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ఆయన ప్రకటించారు.

భారత్-మలేషియా సంబంధాలు ప్రతి సంవత్సరం కొత్త శిఖరాలను అధిరోహిస్తున్నాయని ప్రధానమంత్రి పేర్కొన్నారు. 2024లో మలేషియా ప్రధాని అన్వర్ ఇబ్రహీం న్యూఢిల్లీ పర్యటనను గుర్తుచేసుకుంటూ.. ఆ సమయంలో ఇరుదేశాల ద్వైపాక్షిక సంబంధాలు సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్య స్థాయికి ఎదిగాయని ఆయన తెలిపారు. అభివృద్ధి, శ్రేయస్సు దిశగా ఇరుదేశాలు భాగస్వాములుగా చేతులు కలిపి నడుస్తున్నాయని, ఒకరి విజయాన్ని మరొకరు తమ సొంత విజయంగా జరుపుకుంటున్నారని ప్రధాని అన్నారు.

చంద్రయాన్-3 చారిత్రాత్మక విజయంపై ప్రధాని అన్వర్ ఇబ్రహీం తెలిపిన శుభాకాంక్షలు తనను ఎంతో ఆకట్టుకున్నాయని శ్రీ మోదీ గుర్తుచేసుకున్నారు. భారత్ విజయం మలేషియా విజయం మాత్రమే కాదు..అది మొత్తం ఆసియా విజయం అని ఆయన అంగీకరించారని అన్నారు. ఈ సంబంధానికి మార్గదర్శక పదంగా 'ఇంపాక్ట్' (ఇండియా-మలేషియా పార్టనర్‌షిప్ ఫర్ అడ్వాన్సింగ్ కలెక్టివ్ ట్రాన్స్‌ఫర్మేషన్) అని ఆయన అభివర్ణించారు. ఈ భాగస్వామ్యం సంబంధాల వేగంపై, లక్ష్యాల పరిధిపై, ప్రజలకు చేకూరే ప్రయోజనాలపై గణనీయమైన ప్రభావం చూపుతుందని, ఇరుదేశాలు కలిసి మొత్తం మానవాళికి ప్రయోజనం చేకూర్చగలవని ఆయన అన్నారు.

మలేషియాతో కలిసి పనిచేయడానికి భారతీయ కంపెనీలు ఎల్లప్పుడూ ఆసక్తిగా ఉన్నాయని ప్రధానమంత్రి చెప్పారు. మలేషియాలో మొదటి, ఆసియాలోనే అతిపెద్ద ఇన్సులిన్ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంలో భారత్ పాత్రను ఆయన ప్రస్తావించారు. '100కు పైగా భారతీయ ఐటీ కంపెనీలు మలేషియాలో కార్యకలాపాలు సాగిస్తూ వేలాది ఉద్యోగాలను సృష్టిస్తున్నాయి. మలేషియా-ఇండియా డిజిటల్ కౌన్సిల్ డిజిటల్ సహకారానికి కొత్త మార్గాలను సుగమం చేస్తోంది'' అని శ్రీ మోదీ పేర్కొన్నారు. అలాగే భారతీయ యూపీఐ విధానం త్వరలోనే మలేషియాకు రానుందని ఆయన ప్రకటించారు.

భారత్, మలేషియా హిందూ మహాసముద్రంలోని ఒకే జలాలను పంచుకుంటున్నాయని శ్రీ మోదీ పేర్కొన్నారు. దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించాల్సిందిగా ఆయన అందరికీ ఆహ్వానం పలికారు. "గడిచిన దశాబ్ద కాలంలో భారత్ మౌలిక సదుపాయాల రంగంలో అపూర్వమైన వృద్ధిని సాధించింది. విమానాశ్రయాల సంఖ్య రెట్టింపు అయ్యింది, రికార్డు వేగంతో జాతీయ రహదారుల నిర్మాణం జరుగుతోంది. వందే భారత్ వంటి ఆధునిక రైళ్లకు అంతర్జాతీయంగా ప్రశంసలు లభిస్తున్నాయి'' అని మోదీ వివరించారు. ఇరు దేశాల మధ్య స్నేహానికి ప్రజల మధ్య సంబంధాలే కీలకమని, మలేషియా స్నేహితులతో కలిసి భారత్‌ను సందర్శించాలని ఆయన ప్రోత్సహించారు.

గత దశాబ్ద కాలంలో భారత్ భారీ మార్పులకు లోనైందని ప్రధానమంత్రి చెప్పారు. "11వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ నుంచి భారత్ ఇప్పుడు ప్రపంచంలోని టాప్ 3 ఆర్థిక వ్యవస్థల జాబితాలోకి చేరేందుకు సిద్ధంగా ఉంది. ప్రస్తుతం భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా వృద్ధి చెందుతున్న ప్రధాన ఆర్థిక వ్యవస్థ" అని శ్రీ మోదీ చెప్పారు. మేక్ ఇన్ ఇండియా ఒక చిన్న మొక్కలా ప్రారంభమై నేడు దేశాన్ని ప్రపంచంలోనే రెండవ అతిపెద్ద మొబైల్ తయారీదారుగా మార్చిందని ఆయన గుర్తుచేశారు. రక్షణ ఎగుమతులు 2014 నుంచి దాదాపు 30 రెట్లు పెరిగాయని పేర్కొన్నారు. ''భారత్ ప్రపంచంలోనే మూడవ అతిపెద్ద అంకుర సంస్థల కేంద్రంగా అవతరించింది. ప్రపంచంలోనే అతిపెద్ద డిజిటల్ ప్రజా మౌలిక సదుపాయలు, ఫిన్‌టెక్ వ్యవస్థను నిర్మించింది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న ప్రస్తుత డిజిటల్ లావాదేవీలలో దాదాపు సగం యూపీఐ ద్వారా భారత్‌లోనే జరుగుతున్నాయి. స్వచ్ఛత, హరిత వృద్ధిలో భాగంగా సౌర శక్తి సామర్థ్యం దశాబ్ద కాలంలో దాదాపు 40 రెట్లు పెరిగింది" అని శ్రీ మోదీ స్పష్టం చేశారు.

# ప్రజారోగ్య ప్రచారానికి డెమో విభాగాలు కీలకం..

## -హెల్త్ ఎడ్యుకేషన్ అండ్ మీడియా అధికారుల సంఘం క్యాలెండర్, దినసరి ఆవిష్కరణ



అమరావతి, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య విద్యా, మాధ్యమ అధికారుల సంఘం (ఏపీఎంఓహె అసోసియేషన్), అమరావతి ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ , దినసరిని ఎన్టీఆర్ జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ ఎం. సుహాసిని ఆవిష్కరించారు. వైద్య ఆరోగ్య శాఖలో ప్రజారోగ్య అవగాహన కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేయడంలో డెమో (ప్రదర్శన) విభాగాలు అత్యంత కీలక పాత్ర పోషిస్తున్నాయని డాక్టర్ సుహాసిని తెలిపారు. ప్రభుత్వ ఆరోగ్య పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు సక్రమంగా ప్రజలకు అందాలంటే డెమో విభాగాల సమన్వయంతో పనిచేయడం అవసరమన్నారు. ప్రజలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం, వ్యాధుల నివారణపై ప్రచారం చేయడం, తల్లి-శిశు సంరక్షణ, టీకాల ప్రాముఖ్యత వంటి అంశాలను మాధ్యమాల ద్వారా విస్తృతంగా తెలియజేయడంలో ఆరోగ్య విద్యా విభాగం కీలకంగా వ్యవహరిస్తోందన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ అధికారి (డీపీఎంఓ) డాక్టర్ నవీన్, డాక్టర్ బాలాజీ, డాక్టర్ కార్తీక్, డాక్టర్ సాగర్, గణాంక అధికారి లక్ష్మీజి, రాజశేఖర్, బాషా పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య విద్యా మాధ్యమ అధికారుల సంఘం జిల్లా అధ్యక్షులు చదలవాడ నాగేశ్వరరావు, కొవ్వూరి ప్రభాకంరెడ్డి, ఎం.ఎం.వై. శ్రీనివాస్, మహ్మద్ యూసుఫ్, శ్రీమతి పుష్ప రాణి తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. క్యాలెండర్, దినసరి ద్వారా ఆరోగ్య కార్యక్రమాలపై ప్రజల్లో మరింత అవగాహన పెరుగుతుందని, ప్రభుత్వ ఆరోగ్య సేవలను సమర్థంగా ప్రజలకు చేరువ చేయడానికి ఇది ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.

# భారత్, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందం ముసాయిదాను స్వాగతించిన ప్రధానమంత్రి..

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారతదేశం, అమెరికా మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి కుదిరిన ముసాయిదాను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ స్వాగతించారు. ఈ పరిణామం ఇరుదేశాలకు గొప్ప శుభవార్త అన్నారు.

భారత్-అమెరికా సంబంధాలను బలోపేతం చేయడంలో డొనాల్డ్ ట్రంప్ చూపిన వ్యక్తిగత నిబద్ధతకు ప్రధానమంత్రి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యాచరణ ఇరుదేశాల భాగస్వామ్యంలో పెరుగుతున్న సాన్నిహిత్యం, విశ్వాసం, శక్తిమంతమైన మార్పుని ప్రతిబింబిస్తోందన్నారు.

ఈ ఒప్పందం రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలకు, మత్స్యకారులకు నూతన అవకాశాలను కల్పించటంతో 'మేక్ ఇన్ ఇండియా' బలోపేతం అవటమే కాక, మహిళలకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుందని ప్రధానమంత్రి అన్నారు.

పెట్టుబడులను, సాంకేతిక భాగస్వామ్యాలను ఈ కార్యాచరణ మరింత బలోపేతం చేస్తుందని.. స్థిరత్వం, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలను పటిష్ఠం చేస్తుందని, అలాగే ప్రపంచ వృద్ధికి దోహద పడుతుందని ఆయన చెప్పారు.

వికసిత్ భారత్ లక్ష్యంగా భారతదేశ ఆకాంక్షను ప్రధానమంత్రి స్పష్టం చేశారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజల సాధికారతకు, సామూహిక వృద్ధికి తోడ్పడే ప్రపంచ భాగస్వామ్యాలకు భారత్ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని తెలిపారు.

భారత్, అమెరికా మధ్య కుదిరిన తాత్కాలిక ఒప్పందానికి సంబంధించి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీ పీయూష్ గోయల్ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో చేసిన పోస్టుకు స్పందిస్తూ, శ్రీ నరేంద్ర మోదీ ఇలా పేర్కొన్నారు. రెండు దేశాల మధ్య తాత్కాలిక వాణిజ్య ఒప్పందానికి రూపొందించిన ముసాయిదాపై మేం ఏకాభిప్రాయానికి వచ్చాం. మన దేశాల మధ్య పటిష్ఠమైన సంబంధాల కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చూపిన వ్యక్తిగత నిబద్ధతకు ధన్యవాదాలు.

ఈ కార్యాచరణ ఇరు దేశాల భాగస్వామ్యంలో పెరుగుతున్న సాన్నిహిత్యం, విశ్వాసం, శక్తిమంతమైన మార్పుని ప్రతిబింబిస్తోంది. దీని ద్వారా రైతులకు, పారిశ్రామికవేత్తలకు, ఎంఎస్ఎంఈలు, స్టార్టప్ ఆవిష్కర్తలకు, మత్స్యకారులకు నూతన అవకాశాలు ఏర్పడటం వల్ల 'మేక్ ఇన్ ఇండి యా' బలోపేతం అవుతుంది. మహిళలకు, యువతకు పెద్దఎత్తున ఉపాధి లభిస్తుంది. భారత్, అమెరికా దేశాలు ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ప్రాధాన్య తనిస్తున్నాయి. ఈ కార్యాచరణ మన మధ్య పెట్టుబడులను, సాంకేతిక భాగస్వామ్యాలను మరింత బలోపేతం చేస్తుంది. ఈ ముసాయిదా ద్వారా స్థిరత్వం, విశ్వసనీయమైన సరఫరా వ్యవస్థలు పటిష్టమవటమే కాక, ప్రపంచ వృద్ధికి దోహదపడుతుంది. వికసిత్ భారత్ లక్ష్యంగా భారతదేశం అడుగులు వేస్తున్న తరుణంలో భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రజల సాధికారతకు, సామూహిక వృద్ధికి తోడ్పడే ప్రపంచ భాగస్వామ్యాల నిర్మాణానికి మేం అత్యంత ప్రాధాన్యతనిస్తున్నాం.

# కనకదుర్గమ్మను దర్శించుకున్న జస్టిస్..



అమరావతి, ఫిబ్రవరి 9: ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉట్కూరు శ్రీనివాస్ తమ సతీమణి, కుటుంబ సభ్యులతో కలిసి విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ వారిని దర్శించుకున్నారు.

ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి వి.కె. సీనా నాయక్ జస్టిస్ ఉట్కూరు శ్రీనివాస్‌కు ఘన స్వాగతం పలికి, ఆలయ మర్యాదల ప్రకారం ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేద పండితులు ఆశీర్వచనాలు అందజేయగా, ఈవో అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

# సముద్ర, గగనతల పరమైన సమన్వయ ఆపరేషన్ ద్వారా అంతర్జాతీయ చమురు స్మగ్లింగ్ రాకెట్‌ను పట్టుకున్న ఇండియన్ కోస్ట్ గాం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: అంతర్జాతీయ చమురు స్మగ్లింగ్ రాకెట్‌ను భారత తీర రక్షక దళం (ఐసీజీ) విజయవంతంగా ఛేదించింది. ఫిబ్రవరి 5, 6 తేదీల్లో సముద్ర, గగనతల బృందాల సమన్వయంతో అత్యంత పకడ్బందీగా చేపట్టిన ఆపరేషన్ ద్వారా యుద్ధం, ఘర్షణలు జరుగుతున్న ప్రాంతాల నుంచి పెద్దఎత్తున చమురు, చమురు ఆధారిత కార్గోను అక్రమంగా తరలిస్తున్న ముఠాను ఈ ఆపరేషన్ అడ్డుకుంది.

ఫిబ్రవరి 5, 2026న ముంబైకి పశ్చిమాన సుమారు 100 నాటికల్ మైళ్ల దూరంలో మూడు అనుమానాస్పద నౌకలను భారత కోస్ట్ గార్డ్ నౌకలు అడ్డుకున్నాయి. వాటిని క్షుణ్ణంగా తనిఖీ చేయటం, వాటిలో లభించిన ఎలక్ట్రానిక్ డేటాను విశ్లేషించటం, పత్రాల ధ్రువీకరణ, సిబ్బందిని విచారించటం ద్వారా ఐసీజీ స్పెషలిస్ట్ బోర్డింగ్ బృందాలు ఈ నేరానికి సంబంధించిన పూర్తి వ్యవస్థను, నేరగాళ్లు అనుసరించిన పద్ధతిని తెలుసుకోగలిగాయి.

ఈ స్మగ్లింగ్ ముఠా, తక్కువ ధరకు లభించే చమురును సముద్రంలో నౌకల ద్వారా రవాణా చేసి, అంతర్జాతీయ జలాల్లో మోటార్ ట్యాంకర్లలోకి మార్చేవారు. ఈ ముఠాలో వివిధ దేశాలకు చెందిన హ్యాండ్లర్లు ఉన్నట్లు, వారు సముద్రం మధ్యలో నౌకల ద్వారా సరుకు అమ్మకాలు, బదిలీలను నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక విచారణలో తేలింది.

భారత ప్రత్యేక ఆర్థిక మండలి (ఈఈజడ్) పరిధిలో అనుమానాస్పదంగా ఉన్న మోటార్ ట్యాంకర్‌ను ఐసీజీ అత్యాధునిక సాంకేతిక నిఘా వ్యవస్థలు గుర్తించాయి. దీని ఆధారంగా చేపట్టిన డిజిటల్ విచారణ, నౌకల కదలికల విశ్లేషణలో.. ఆ ట్యాంకర్ వద్దకు మరో రెండు నౌకలు వచ్చినట్లు తెలిసింది. భారత్ సహా తీరప్రాంత దేశాలకు చెల్లించాల్సిన సుంకాలను ఎగ్గొట్టేందుకు, చట్టవిరుద్ధంగా ఒక నౌక నుంచి మరో నౌకలోకి చమురును బదిలీ చేస్తున్నట్లు అనుమానం వ్యక్తమైంది. ఈ నేపథ్యంలోనే ఆపరేషన్‌ను ప్రారంభించారు.

ఫిబ్రవరి 5, 2026న స్వయంగా నౌకల వద్దకు వెళ్లి డిజిటల్ సాక్ష్యాలను ధ్రువీకరించుకున్న తర్వాత, మూడు నౌకలను అదుపులోకి తీసుకున్నారు. సముద్ర చట్టాలను అమలు చేసే సంస్థల నుంచి తప్పించుకునేందుకు ఈ నౌకలు తరచుగా గుర్తింపును మారుస్తున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. అంతేకాక, ఈ నౌకల యజమానులు విదేశాల్లో ఉన్నట్లు దర్యాప్తు ద్వారా తెలుస్తోంది. అదుపులోకి తీసుకున్న ఈ నౌకలను తదుపరి విచారణకు ముంబైకి తరలించే అవకాశముంది. చట్టపరమైన చర్యల నిమిత్తం వీటిని భారత కస్టమ్స్, ఇతర చట్ట అమలు సంస్థలకు అప్పగించనున్నారు.

అత్యాధునిక డిజిటల్ నిఘా ద్వారా ప్రారంభమై, భారత తీరరక్షక దళం విస్తృత సముద్రయాన ఉనికితో అమలైన ఈ ఆపరేషన్, సముద్ర తీర ప్రాంతంలో 'ప్రధాన భద్రతా ప్రదాత'గా, అంతర్జాతీయ సముద్ర నియమ నిబంధనలను కచ్చితంగా అమలు చేసే శక్తిగా భారతదేశ పాత్రను మరోసారి స్పష్టం చేసింది.

# ఇతర తీరప్రాంత రాష్ట్రాలతో కలిసి భారత బ్లూ ఎకానమీ మిషన్‌కు నాయకత్వం వహిస్తున్న ఆంధ్రప్రదేశ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఇతర తీరప్రాంత రాష్ట్రాలతో కలిసి భారత బ్లూ ఎకానమీ పరివర్తనకు ఆంధ్రప్రదేశ్ మార్గదర్శనం చేస్తోందని కేంద్ర శాస్త్ర, సాంకేతిక, ఎర్త్ సైన్సెస్, ఎమ్‌వోఎస్ పీఎమ్‌వో, సిబ్బంది, ప్రజా ఫిర్యాదులు, పెన్షన్లు, అణుశక్తి, అంతరిక్ష శాఖల సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) డాక్టర్ జితేంద్ర సింగ్ ఈ రోజు వ్యాఖ్యానించారు.

బ్లూ ఎకానమీని జాతీయ ప్రాధాన్య లక్ష్యంగా రూపొందించాలని ఎర్రకోట నుంచి ప్రధానమంత్రి స్పష్టం చేసిన విషయాన్ని ప్రస్తావిస్తూ... మత్స్య సంపద, సముద్ర ఎగుమతులు, తీరప్రాంత మౌలిక సదుపాయాలు, సముద్ర ఆధారిత ఆర్థిక కార్యకలాపాలను భారత దీర్ఘకాలిక వృద్ధి వ్యూహంలో కేంద్రంగా ఉంచడం ద్వారా 2026?27 కేంద్ర బడ్జెట్ ఈ దార్శనికతకు దృఢమైన రూపాన్ని ఇస్తుందని మంత్రి తెలిపారు.

శ్రీ కనక దుర్గమ్మ ఆశీర్వాదం గల పవిత్ర నగరం విజయవాడలో మీడియా ప్రతినిధులు, సోషల్ మీడియా ప్రభావశీలురను ఉద్దేశించి కేంద్ర మంత్రి ప్రసంగించారు. 2047 వికసిత్ భారత్ కోసం వ్యూహాత్మక రోడ్‌మ్యాప్‌గా 2026-27 కేంద్ర బడ్జెట్‌ను ఆయన అభివర్ణించారు. ప్రపంచ ఆర్థిక అనిశ్చితి సమయంలోనూ భారత్ సుస్థిరత, స్పష్టత, స్థిరమైన పెట్టుబడి ఆధారిత వృద్ధి మార్గాన్ని ఎంచుకుందని ఆయన తెలిపారు.

మత్స్య సంపద, సముద్ర అభివృద్ధితో ప్రారంభించి, భారత ప్రత్యేక ఆర్థిక మండలిలో లోతైన సముద్ర ప్రాంతంలో చేపల వేటను అనుమతించడం, విదేశీ ఓడరేవుల్లో చేపల పెంపకాన్ని ఎగుమతులుగా గుర్తించడం వల్ల మత్స్యకారుల ఆదాయ సామర్థ్యం గణనీయంగా పెరుగుతుందని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. ఈ విధాన మార్పు ఆహార భద్రతను బలపరుస్తుందని, ఎగుమతి రంగంలో పోటీతత్వాన్ని పెంచుతుందని, నీలి సముద్ర దేశంగా భారత్ స్థానాన్ని బలోపేతం చేస్తుందని ఆయన తెలిపారు. పొడవైన తీరప్రాంతం, సుస్థిర ఆక్వా కల్చర్ వ్యవస్థ కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఈ చర్యల ద్వారా గణనీయ ప్రయోజనం పొందుతుందని కేంద్ర మంత్రి పేర్కొన్నారు.

జలాశయాల ఆధునీకరణ, తీరప్రాంతంలో మత్స్యరంగ మౌలిక సదుపాయాలు, కోల్డ్ చైన్ నెట్‌వర్క్‌లు, ప్రాసెసింగ్ సౌకర్యాలను బలోపేతం చేయడం ద్వారా సమగ్ర సముద్ర ఆర్థిక విధానాన్ని రూపొందిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ విధానం జీవనోపాధి, ఎగుమతులు, సరుకు రవాణా, విలువ జోడింపులను అనుసంధానిస్తూ తీరప్రాంత రాష్ట్రాలను జాతీయ ఆర్థిక వ్యవస్థకు వృద్ధి చోదకాలుగా చేస్తుందన్నారు.

దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న వ్యూహాత్మక పారిశ్రామిక కారిడార్‌లతో బ్లూ ఎకానమీ మిషన్‌ను మంత్రి అనుసంధానించారు. ఆంధ్రప్రదేశ్‌లో రేర్ ఎర్త్, క్రిటికల్ మినరల్స్ కారిడార్ రాష్ట్రాన్ని తదుపరి తరం తయారీ, పునరుత్పాదక ఇంధన విభాగాలు, అధునాతన పదార్థాల రంగాల్లో ముందంజలో ఉంచుతుందని తెలిపారు. దీంతో పాటు తూర్పు తీరంలోని పారిశ్రామిక కారిడార్లు లాజిస్టిక్స్ ఏకీకరణను బలోపేతం చేస్తాయనీ, ప్రపంచ సరుకు రవాణా భాగస్వామ్యాన్ని మెరుగుపరుస్తాయని కేంద్ర మంత్రి వివరించారు.

అభివృద్ధి చెందుతున్న రంగాల గురించి ప్రస్తావిస్తూ... పరిశుద్ధ ఇంధన పరివర్తనకు అవసరమైన పదార్థాలను సంగ్రహించడానికి, ప్రాసెస్ చేయడానికి, తయారు చేయడానికి, పంపిణీ చేయడానికి అవసరమైన సమగ్ర, పరస్పర అనుసంధానితమైన, పెరుగుతున్న డిజిటలైజ్డ్, సుస్థిర, వ్యూహాత్మక కార్యకలాపాల నెట్‌వర్క్ సహా ప్రత్యేక కారిడార్ల అభివృద్ధి భారత సముద్ర, ఎగుమతి లక్ష్యాలను సాకారం చేస్తుందని ఆయన అన్నారు. ఓడరేవులు, కంటైనర్ తయారీ, రైలు కనెక్టివిటీ, పారిశ్రామిక క్లస్టర్ల ఏకీకరణ తీరప్రాంతాలను తయారీ కేంద్రాలతో అనుసంధానిస్తూ సజావైన ఆర్థిక నిర్మాణాన్ని సృష్టిస్తుందన్నారు.

అమరావతికి మౌలిక సదుపాయాల మద్దతు, మూలధన పెట్టుబడుల విస్తరణ, పోలవరం నీటిపారుదల ప్రాజెక్టుకు నిరంతర మద్దతు గురించి డాక్టర్ జితేంద్ర సింగ్ ప్రస్తావించారు. దీర్ఘకాలిక ఉత్పాదకత, నీటి భద్రతకు పునాదిగా ఈ పెట్టుబడులను ఆయన అభివర్ణించారు. వ్యవసాయం, అధిక విలువ కలిగిన తోట పంటలు, ఎమ్ఎస్ఎమ్ఈ వృద్ధి నిధులు, మహిళల నేతృత్వంలోని స్వయం సహాయక బృందాల వ్యాపారాలను సమ్మిళిత అభివృద్ధిలో కీలకమైన భాగాలుగా బడ్జెట్ విధాన ప్రణాళికలో పేర్కొన్నట్లు ఆయన వివరించారు.

ఉత్పాదకత, సమర్థత, సమ్మిళితత్వాన్ని మిళితం చేస్తూ, అధిక స్థాయి మూలధన వ్యయాన్ని కొనసాగిస్తూ బడ్జెట్ ఆర్థిక క్రమశిక్షణను నిర్ధారిస్తోందని ఆయన అన్నారు. మత్స్య సంపద, ఓడరేవులు, పారిశ్రామిక కారిడార్లు, డిజిటల్ మౌలిక సదుపాయాలు, ముడి ఖనిజాల నుంచి తుది ఉత్పత్తులను తయారు చేయు కార్యకలాపాలు, వ్యవసాయ ఎగుమతుల్లో విస్తరించిన ఆంధ్రప్రదేశ్ పాత్ర... భారత్ వృద్ధి ప్రయాణంలో కీలకంగా మారిందని డాక్టర్ జితేంద్ర సింగ్ తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వం, ఎగుమతి ఆధారిత, ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థగా మారడం దిశగా 2026-27 కేంద్ర బడ్జెట్ భారత్‌ను నిర్ణయాత్మకంగా ముందుకు నడిపిస్తుందని కేంద్ర మంత్రి వ్యాఖ్యానించారు. తీరప్రాంత రాష్ట్రాలు బ్లూ ఎకానమీ మిషన్‌కు నాయకత్వం వహిస్తున్నాయనీ, పారిశ్రామిక కారిడార్లు అధునాతన తయారీని నడిపిస్తున్నాయని ఆయన తెలిపారు. వికసిత్ భారత్ 2047 దిశగా భారత ప్రయాణంలో ఆంధ్రప్రదేశ్ కీలక భాగస్వామిగా నిలిచిందని కేంద్ర మంత్రి డాక్టర్ జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

# సమ్మిళిత, బాధ్యతాయుత, స్థితిస్థాపక ఏఐ కోసం దేశాలు, ఆవిష్కర్తలు, పౌరులను ఏకం చేసే ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: కృత్రిమ మేధ (ఏఐ) అనేది ఇకపై భవిష్యత్తుకు సంబంధించినది మాత్రమే కాదు.. ఇప్పటికే మన జీవనశైలిలో భాగమైన అంశం. భారతీయులు నేర్చుకునే విధానాన్ని, పని చేసే పద్ధతిని, సేవలను పొందే రీతిని రోజువారీ సమస్యలను ఎలా పరిష్కరిస్తున్నారనే విధానాన్ని ఏఐ మార్చివేస్తోంది. ఈ సందేశమే 2026 ఫిబ్రవరి 6న నిర్వహించిన 'డిజిటల్ ఇండియా- ఆస్క్ అవర్ ఎక్స్‌పర్ట్స్' తాజా తాజా ఎపిసోడ్‌లో ప్రధాన అంశంగా నిలిచింది. ఈ కార్యక్రమంలో త్వరలో జరగబోయే 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్' (భారత కృత్రిమ మేధ ప్రభావ సదస్సు) గురించి ఇండియా-ఏఐ మిషన్ సీఈఓ శ్రీ అభిషేక్ సింగ్‌తో ఆసక్తికరమైన, ఆలోచనాత్మకమైన చర్చ జరిగింది.

సదస్సు కేవలం సాంకేతిక చర్చలకే పరిమితం కాకుండా ఒక ప్రజా-కేంద్రీకృత వేదికగా ఎలా పనిచేస్తుందో ఈ ఎపిసోడ్ వివరించింది. ముఖ్యంగా విద్య, ఆరోగ్యం, వ్యవసాయం, పాలన, అంకుర సంస్థలు, సేవలు, ఉపాధి వంటి రంగాలలో పౌరులు తమ ప్రయోజనం కోసం కృత్రిమ మేధను ఎలా ఉపయోగించుకోవచ్చనే దానిపై ఈ సదస్సు దృష్టి సారించనుంది.

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న కృత్రిమ మేధ చర్చలను క్షేత్రస్థాయిలో ప్రజలకు ఉపయోగపడే, నిజమైన ఫలితాలుగా మార్చడమే ఈ సదస్సు లక్ష్యం. ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలు, దేశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోంది. 'ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు' ద్వారా భారత్ ప్రపంచ కృత్రిమ మేధ చర్చను ఆలోచన నుంచి ఆచరణ వైపు మళ్లిస్తోంది. ఏఐ ఆవిష్కరణలు, నైపుణ్యాలు, ప్రయోజనాలు అందరికీ ముఖ్యంగా అభివృద్ధి చెందుతున్న దేశాల కు అందుబాటులో ఉండేలా చూస్తోంది." అని శ్రీ సింగ్ పేర్కొన్నారు.

రైతులకు పంట ప్రణాళికను మెరుగుపరచడంలో ఏఐ సహాయపడగలదని.. వైద్యులు వేగంగా, మరింత ఖచ్చితమైన వ్యాధి నిర్ధారణకు వీలు కల్పిస్తుందని ఆయన తెలిపారు. ఉపాధ్యాయులకు వ్యక్తిగతీకరించిన బోధనా సాధనాలు అందించగలదని, చిన్న వ్యాపారాలు, అంకుర సంస్థలు వేగంగా విస్తరించేందుకు సహాయపడుతుందని చెప్పారు. అలాగే ఉద్యోగార్థులు కొత్త వృత్తి మార్గాలను గుర్తించేందుకు దోహదపడుతుందని ప్రస్తావించారు. ఈ సదస్సు అటువంటి ఆచరణాత్మక వినియోగ సందర్భాలను ప్రదర్శిస్తుంది. కృత్రిమ మేధ కేవలం ఆటోమేషన్ మాత్రమే కాకుండా చేరిక, సామర్థ్యం, సాధికారతకు ఎలా ఒక సాధనంగా ఉంటుందో ప్రదర్శిస్తుంది. "కృత్రిమ మేధ ప్రజలను భర్తీ చేయడానికి కాదు..ఇది వారిని శక్తిమంచేయడానికి ఉద్దేశించినది. రోజువారీ జీవితాన్ని ఎలా మెరుగుపరుస్తుందో, కొత్త అవకాశాలను ఎలా సృష్టించగలదో, భారత్‌ను భవిష్యత్తుకు సిద్ధంగా ఉంచగలదో పౌరులు అర్థం చేసుకోవడానికి ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు సహాయపడుతుంది" అని శ్రీ సింగ్ పేర్కొన్నారు.

# 15న శివరాత్రి జాగరణ



అమరావతి, ఫిబ్రవరి 9: ఈ నెల 15 రాత్రి రహీంపురా సత్తెన్నగల్లీలోగల చారిత్రక శ్రీ శంకర్ జి హనుమాన్ జి, అయ్యప్ప స్వామి దేవాలయ కల్యాణ మండపంలో శ్రీ శివ మహా జాగరణ మహోత్సవాన్ని భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు చైర్మన్ గోడిశాల నరేష్ గౌడ్, అధ్యక్షుడు బి.రాజ్ కుమార్ ముదిరాజ్, ప్రధానకార్యదర్శి. కె.మోహన్ గౌడ్, కోశాధికారి ఎం. పురుషోత్తం సింగ్, ఆర్గనైసింగ్ సెక్రటరీ ఎస్. రామ్ నాథ్, కన్వీనర్ ఓంకారి ధనరాజ్ సలహాదారులు ఆనంద్ సింగ్ లోధలు తెలిపారు. ఈ మేరకు ఈ రోజు దేవాలయంలో శ్రీ మహా శివరాత్రి జాగరణ మహోత్సవం బ్రోచర్ విడుదలచేసారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంత రం వారు మాట్లాడుతూ అయ్యప్ప కల్యాణ మం డపంలో ఆదివారం రాత్రి భాగ్యనగర్ శ్రీ మాశక్తి యువ మండల్ ద్వార జాగరణ భజనలు, ప్రముఖ్ భజన గాయకులు టీ.రవి సింగ్, మనోజ్ శర్మ, ప్రవీణ్ లు ఆలపిస్తారు. అలాగే మధురకు చెందిన కృష్ణ బ్రిజ్ వాసి గ్రూప్ వారిచే వివిధ దేవతల వేశాధారణ, సాంకృతిక కార్యక్రమం భక్తులను అలరిస్తాయిన్నారు. 16వ తేదీన ఉదయం 9.30 గంటలకు అయ్యప్ప స్వామి దేవాలయంలో అన్న ప్రసాద కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో బి. గోవింద్ రావు, కె. రాజు గుప్తా, బాలకిషన్ చవాన్, నాగి రెడ్డి, దీపక్ సింగ్, పి. శ్రీధర్, జీవన్ ప్రసాద్, శ్యామ్ రావు, విశ్వనాధ్ ఆనంద్, అమరనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# భక్తుల సౌకర్యార్థం రహదారికి ఇరువైపులా పిచ్చి మొక్కల తొలగింపు

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9: మహా శివరాత్రి సందర్భంగా ఆలయానికి భక్తులు వచ్చే మార్గంలో ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను పంచాయతీ అధికారులు తొలగించారు. మంచిర్యాల జిల్లా కాసిపేట మండలం కోమటిచేను గ్రామ పంచాయతీ పరిధిలోని వరిపేట శివారు మీదుగా శివాలయం వెళ్లే మార్గంలో రోడ్డుకు ఇరువైపులా భారీగా పిచ్చి మొక్కలు భారీగా పెరిగాయి.

ఈ కారణంగా ఆలయానికి వచ్చే భక్తులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిపై పెరిగిన పిచ్చి మొక్కలను సోమవారం జేసీబీ ( ఏఅః ) తో పూర్తిగా తొలగించి రాకపోకల సమస్యను పరిష్కరించారు. సర్పంచ్ జాడి మాణిక్య శంకరయ్య, ఉప సర్పంచ్ కొడప అనంత రావు, వార్డ్ సభ్యులు సరోజ, గుండేటి నర్సయ్య, న్యాయవాది, నాయకులు మాసు సుధాకర్, మండల సోషల్ మీడియా కో ఆర్డినేటర్ దుర్గం గణేశ్, శంకర్, నరేష్, తదితరులు పనులను పరిశీలించారు.

# బీజేపీ అభ్యర్థుల గెలుపునకు నాయకుల ప్రచారం

## -పట్టణంలో కార్నర్ మీటింగ్

ఆదిలాబాద్, ఫిబ్రవరి 9: మున్సిపల్ ఎన్నికల్లో భారతీయ జనతా పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం బీజేపీ రాష్ట్ర నాయకులు ప్రచారం నిర్వహించారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా ఈ రోజు మున్సిపల్ 21వ వార్డ్ అభ్యర్థి బండారి గిరి ప్రసాద్, 7వ వార్డ్ అభ్యర్థి ఆర్ పి జయంత్ లాల్ గెలుపే లక్ష్యంగా ప్రజలతో మమేకమై స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు.

ఇంటింటా విస్తృత ప్రచార కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు పరకాల నియోజకవర్గం కాంటెస్టెడ్ ఎమ్మెల్యే డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్ రావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మున్సిపల్ ఎన్నికల కన్వీనర్ డాక్టర్ సిరంగి సంతోష్ కుమార్ విస్తృత ప్రచారం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టీమ్‌వర్క్‌గా చేద్దాం

**-కాలం చెల్లిన చట్టాలొద్దు**
**-వాటిని మార్చుకుందాం**
**-ప్రజల అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి**
**-సంక్షేమంతోనే అసమానతలు తగ్గుతాయి**
**-హెలీప్యాడ్ కోసం భూమి ఇవ్వలేదని?**
**-22ఏలో పెట్టేశారు**
**-ప్రపంచంతో పోటీ పడదాం**
**-టెక్నాలజీతో అవకాశాలను అందిపుచ్చుకుందాం**
**-సమష్టి కృషితో లాభాల బాటలో విశాఖ స్టీల్ ప్లాంట్**
**-సచివాలయంలో సీఎం చంద్రబాబు**

అమరావతి, ఫిబ్రవరి 9: అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందినప్పుడే రాష్ట్రం అభివృద్ధి చెందినట్టుగా భావించాలని ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగయ్యేలా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోందని వాటిని నిబద్ధతతో క్షేత్రస్థాయిలో అమలు చేయాల్సిన బాధ్యత అధికార యంత్రాంగంపై ఉంటుందన్నారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఐదవ బ్లాకులో సీఎం చంద్రబాబు అధ్యక్షతన మంత్రులు, కార్యదర్శుల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జీఎస్డీపీ వృద్ధిరేటు, స్వర్ణాంధ్ర 2047 విజన్ లక్ష్యాల్లో భాగంగా పది సూత్రాల అమలు, ఆదాయార్జన శాఖలపై చర్చించారు.

2026..-27లో కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఇక రియల్ టైమ్ గవర్నెన్సులో




భాగంగా అవేర్, డేటా లేక్ సహా పాలనలో ఏఐ టూల్స్ ఇతర సాంకేతికత వినియోగంపై సమావేశంలో ప్రస్తావించారు. నైపుణ్యాభివృద్ధి, వన్ ఫ్యామిలీ వన్ ఎంట్రప్రెన్యూయర్ విధానం అమలు, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ సహా రాష్ట్రంలో శాంతిభద్రతల అంశంపై సీఎం దిశా నిర్దేశం చేశారు.

### నెలవారీ సమీక్ష అనివార్యం

ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వర్చువల్ గా హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ "ప్రభుత్వం చేపడుతున్న వివిధ కార్యక్రమాలను నెల వారీగా సమీక్షించుకోవాలి, క్షేత్రస్థాయిలో పనుల్ని బేరీజు వేసుకోవాలి. ప్రతీ నెలా 2 సార్లు కేబినెట్ సమావేశాలు, ఎస్ఐపీబీ ద్వారా ప్రాజెక్టులకు ఆమోదం ఇస్తున్నాం. జిల్లా స్థాయిలో కలెక్టర్లు, ఇంఛార్జ్ మంత్రులు కూడా అదే వేగంతో పనులు జరిగేలా చూడాలి. గత 19 నెలల్లో ఏపీలో చేపట్టిన కార్యక్రమాలు, టెక్నాలజీ సహా ఏఐ అప్లికేషన్ల వినియోగం ఎలా జరుగుతుందో అంచనా వేసుకోవాలి , అని సీఎం చంద్రబాబు అన్నారు.

### అగాధం నుంచి బయటపడ్డాం

ప్రతీ మూడు నెలలకోసారి ప్రభుత్వ ప్రగతి పనుల పురోగతిపై బేరీజు వేస్తున్నాం. ఇలా ఎప్పటికప్పుడు బేరీజు వేసుకోవడంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను ఏమేరకు చేరుకున్నామన్నదానిపై స్పష్టతతో ఉంటున్నాం. గడచిన 19 నెలల్లో అగాధం, అంధకారం నుంచి రాష్ట్రాన్ని బయటపడేశాం. వ్యవస్థలను తిరిగి గాడిన పెట్టగలిగాం. సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నాం. సూపర్ సిక్స్ సూపర్ హిట్ అయింది. తల్లికి వందనం ద్వారా రూ.10 వేల కోట్ల తల్లుల ఖాతాల్లో వేశాం. స్త్రీశక్తి పథకం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మొబిలిటి పెరిగింది 4.29 కోట్ల మేర ఉచిత ప్రయాణాలు ఇప్పటి వరకూ జరిగాయి. ప్రస్తుతం ఉన్న బస్సులతోనే ఆక్యుపెన్సీ పెరిగింది. అన్నదాత సుఖీభవ ద్వారా రూ. 6,310 కోట్ల ఆర్థిక సహకారం అందించాం, అని వివరించారు

### అన్ని ప్రాంతాల అభివృద్ధే లక్ష్యం

రాయలసీమలో హార్టి కల్చర్ హబ్, కోస్తాలో ఆక్వా కల్చర్ పెంచేలా చర్యలు చేపట్టాం. రైతు ఆత్మహత్యలనేవి జరగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం ఎవరైనా ఆత్మహత్య చేసుకుంటే వాటిని అధ్యయనం చేసి రైతులను ఆదుకుంటున్నాం. దీపం 2.0 ద్వారా 4 విడతల్లో 3.64 కోట్ల గ్యాస్ సిలెండర్లు ఇప్పటి వరకూ ఇచ్చాం. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల ద్వారా రూ.58 వేల కోట్ల మేర ఆర్థిక చేయూత అందించాం. సంక్షేమ పథకాలు అవసరమా అనే చర్చ సరికాదు పేదలను ఆదుకునేందుకు సంక్షేమ పథకాలు అవసరమే"అని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

### అందర్నీ ఆదుకుంటున్నాం

"రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్నా క్యాంటీన్లను ఏర్పాటు చేసి అన్నార్తుల ఆకలి తీరుస్తున్నాం. పేదవాడికి అన్నం పెట్టే అన్న క్యాంటీన్లను గత ప్రభుత్వం రద్దు చేసింది. ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా డ్రైవర్లకు మేలు చేస్తున్నాం. రూ.1,100 కోట్లు మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం ద్వారా రైతులను ఆదుకుంటున్నాం, అని వివరించారు.

### భూమి ఇవ్వలేదని 22 ఏలో పెట్టేశారు

ధాన్యం కొనుగోళ్లకు కూడా రూ.10 వేల కోట్ల మేర 48 గంటల్లోనే చెల్లింపులు చేశాం. రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలను రాష్ట్రవ్యాప్తంగా రైతులకు ఇస్తున్నాం. తాడేపల్లి ప్యాలెస్ వద్ద హెలిపాడ్ కోసం ఓ ప్రైవేటు భూమిని అక్రమంగా 22 ఏలో పెట్టేశారు. ముఖ్యమంత్రిగా పని చేసిన వ్యక్తి ఈ తరహాలో అధికారం దుర్వినియోగం చేశారు. ఇది ఒక్క తాడేపల్లిలోనే కాదు రాష్ట్రంలోని వేర్వేరు ప్రాంతాల్లో చోటు చేసుకుంది.

### అభివృద్ధి వైపే మన పరుగు

భూవివాదాలు లేకుండా పకడ్బందీగా సర్వే ప్రక్రియ చేపడుతున్నాం. క్యూఆర్ కోడ్ సహా ఇతర భద్రతా ఫీచర్లతో పాస్ పుస్తకాలను అందిస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులకు ఇప్పటి వరకూ రూ.24 వేల కోట్లు ఖర్చు చేశాం. క్వాంటం వ్యాలీకి ఇటీవలే శంకుస్థాపన చేసి అమరావతిని క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా మారుస్తున్నాం. విశాఖలో గూగుల్‌తో పాటు ఇతర సంస్థలు కూడా డేటా సెంటర్లు ఏర్పాటు చేయబోతున్నాయి. మొత్తం 5 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు రాబోతున్నాయి. కాకినాడలో గ్రీన్ అమ్మోనియా తయారీకి కూడా కార్యాచరణ మొదలైంది. విద్యుత్ రంగంలో ట్రూ అప్ నుంచి ట్రూడౌన్ చేసే పరిస్థితికి వచ్చాం. మెగా డీఎస్సీ ద్వారా 16,347 టీచర్ పోస్టులను భర్తీ చేశాం. 5757 మంది కానిస్టేబుళ్ల నియామకం కూడా పూర్తి చేశాం? వారి స్టైఫండ్ రూ.4500 నుంచి రూ రూ.12,500కు పెంచాం. మార్చిలోగా రాష్ట్రంలో పేరుకుపోయిన చెత్తను క్లియర్ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాం" అని సీఎం చంద్రబాబు వెల్లడించారు.

### రహదారులు కళ కళ

"రూ.1,000 కోట్లతో రోడ్ల మరమ్మతులు చేశాం..మరో రూ.3 వేల కోట్లు ఖర్చు చేసి రోడ్లను నిర్మిస్తున్నాం. పల్లె పండుగ ద్వారా రూ.4 వేల కోట్లు ఖర్చు పెట్టి గ్రామీణ ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం. జీ రామ్ జీ పథకాన్ని పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు పెడుతున్నాం. రూ.20 లక్షల కోట్ల పెట్టుబడుల ద్వారా 23 లక్షల మందికి ఉద్యోగాలు రానున్నాయి. జల్ జీవన్ మిషన్ పథకాన్ని గతంలో అస్తవ్యస్తం చేశారు.

దాన్ని సరిదిద్ది రూ.25 వేల కోట్లతో ఇంటింటికీ కుళాయి ద్వారా సురక్షిత తాగునీరు ఇస్తాం. డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం ద్వారా విద్యార్థులకు నాణ్యమైన భోజనం పెడుతున్నాం, స్కూల్ కిట్లు పంపిణీ చేశాం. ఈసారి 9.88 గ్రోత్ రేట్ సాధించాం. త్వరలోనే డబుల్ డిజిట్ గ్రోత్ సాధించాలి. తలసరి ఆదాయం పెరిగేలా నిర్దుష్టమైన ప్రమాణాలను పెట్టుకున్నాం. సంజీవని ప్రాజెక్టు ద్వారా డిజిటల్ హెల్త్ కేర్ నిర్వహించాలని నిర్ణయించాం. యూనివర్సల్ హెల్త్ ఇన్సూరెన్స్ ద్వారా రాష్ట్రంలో ప్రతీ ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య భీమా కల్పిస్తున్నాం.

### వచ్చే ఏడాది పోలవరం జాతికి అంకితం

పోలవరం ప్రాజెక్టును 2027 పుష్కరాల నాటికి పూర్తి చేసి జాతికి అంకితం చేస్తాం. రూ.440 కోట్లతో కట్టిన డయాఫ్రమ్ వాల్ ను గత పాలకులు ధ్వంసం చేశారు. ఇప్పుడు అదనంగా రూ.1000 కోట్ల మేర దాని నిర్మాణానికి ఖర్చు అవుతోంది. అమరావతి రాజధానిని శ్మశానమని, ఎడారని అన్నారు. వచ్చే మూడేళ్లలో మోస్ట్ లివబుల్ సిటిగా మారుస్తాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తి సహకారం అందింటీచటంతో విశాఖ స్టీల్ ప్లాంట్ లాభాల బాటలో పడింది.

### టీమ్‌వర్క్ చేద్దాం

అంతా టీమ్ స్పిరిట్ తో పని చేయాలి. ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు ఇచ్చే విధంగా ముందుకు వెళ్లాలి. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్సు పాలనలో రావాలని అందరినీ కోరుతున్నాను. అవుట్ డేటెడ్, అవసరం లేని చట్టాలను సమీక్షించుకుని ముందుకు వెళ్దాం. మెరుగైన ఫలితాలు సాధించడానికి లక్ష్యాలు నిర్దేశించుకుని అంతా కలిసి పని చేద్దాం. 2026..-27లో అనుకున్న లక్ష్యాలను సాధించేలా కార్యాచరణ ఉండాలి."

### ఉదాసీనత వద్దు : డిప్యూటీ సీఎం

రాష్ట్రాభివృద్ధి కోసం నిర్దేశించుకున్న లక్ష్యాలకు అనుగుణంగా పని చేయాలని మంత్రులు, కార్యదర్శుల సమావేశంలో ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ప్రభుత్వం ఏర్పడ్డాక అమలు చేస్తున్న పథకాలపై సమీక్షించుకుంటున్నట్టు చెప్పారు.

పల్లె పండుగ ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. జల్ జీవన్ మిషన్ ద్వారా పెద్ద ఎత్తున కోట్లాది రూపాయల విలువైన పనులు ప్రారంభం అయ్యాయని గుర్తు చేశారు. ఇవన్నీ ప్రజలకు అందుబాటులోకి రావాలని? ఈ సేవలన్నీ ప్రజలకు చేరేలా అధికారులు పని చేయాలని డిప్యూటీ సీఎం సూచించారు. నగర వనాలతో పాటు వివిధ అభివృద్ధి కార్యక్రమాలను అటవీశాఖ ద్వారా చేపడుతున్నామని వెల్లడించారు. తక్కువ ఆర్థిక వనరులతోనే రాష్ట్రంలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

ప్రధాని నరేంద్ర మోదీ రాష్ట్రప్రభుత్వానికి పూర్తిగా సహకారం అందిస్తున్నారని డిప్యూటీ సీఎం తెలిపారు. నిధుల కొరత ఉన్నప్పటికీ నిర్దేశిత గడువులోగా లక్ష్యాలను చేరుకునే ప్రయత్నం చేస్తున్నామని చెప్పారు. క్షేత్రస్థాయిలో ఉదాసీనత లేకుండా పని చేయాలని? దీనిని అధిగమించేలా మన కార్యచరణ ఉండాలని ఉప ముఖ్యమంత్రి ఆదేశించారు. ఈ గ్యాప్స్ సవరించుకుని ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో అమలు అవుతున్న కార్యక్రమాల్ని పర్యవేక్షించాలని డిప్యూటీ సీఎం కోరారు. ఈ సమావేశంలో మంత్రులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## భారత్-యూఎస్ వాణిజ్య ఒప్పందం.. జౌళి పరిశ్రమకు భారీ ప్రోత్సాహం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: భారత్, అమెరికా (యూఎస్) మధ్య కుదిరిన చారిత్రక ఒప్పందాన్ని కేంద్ర జౌళి మంత్రిత్వ శాఖ స్వాగతించింది. ఇది రెండు దేశాల మధ్య వస్త్ర వాణిజ్య సంబంధాలను మెరుగుపరిచే ఉత్ప్రేరకమని పేర్కొంది. ఈ ఒప్పం దం జౌళి రంగానికి ప్రధాన ఆర్థిక మలుపని పరిశ్రమ వర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

వస్త్ర ఎగుమతులకు సంబంధించి, వస్త్రాలు, దుస్తులు, ఇతర వస్త్ర ఉత్పత్తులకు 118 బిలియన్ డాలర్ల అమెరికా ప్రపంచ దిగుమతుల మార్కెట్ చేరేందుకు మార్గం సుగమం అవుతుంది. భారతదేశం నుంచి సుమారు 10.5 బిలియన్ డాలర్ల ఎగుమతులతో మనకు అతిపెద్ద ఎగుమతిదారుగా యూఎస్ ఉంది. ఇందులో సుమారు 70% దుస్తులు, 15% ఇతర వస్త్రాలు ఉన్నందున, ఇది మనకు గొప్ప అవకాశం. 2030 నాటికి 100 బిలియన్ డాలర్ల ఎగుమతుల లక్ష్యాన్ని భారత్ చేరుకోవటంలో ఇది కీలక పాత్ర పోషిస్తుంది. ఈ లక్ష్య సాధనకు కావాల్సిన వేగాన్ని ఈ ఒప్పందం అందించటమే కాక, అమెరికా ఐదో వంతుకు పైగా వాటాను కలిగి ఉంటుంది.

దుస్తులు, ఇతర వస్త్ర ఉత్పత్తులతో సహా అన్ని జౌళి ఉత్పత్తులపై విధించిన 18% పంస్పర సుంకాలు.. భారత ఎగుమతిదారులకున్న ప్రతికూలతను తొలగించటమే కాక, ఇతర పోటీదారులైన బంగ్లాదేశ్ (20%), చైనా (30%), పాకిస్తాన్ (19%), వియత్నాం (20%) కంటే తక్కువ సుంకాలతో మెరుగైన స్థితిలో ఉంటాయి. ఈ ఒప్పందం నేపథ్యంలో పెద్దఎత్తున కొనుగోలుచేసేవారు సరఫరా విధానాలను పునః పరిశీలించట ం వల్ల మార్కెట్ పోకడలు మారుతాయి.

పరిశ్రమలు ఖర్చులను తగ్గించుకుని పోటీతత్వాన్ని పెంచుకోవటానికి ఈ ఒప్పందం తోడ్పడుతుంది. జౌళి రంగానికి అవసరమైన ముడి పదార్థాలను అమెరికా నుంచి దిగుమతి చేసుకోవటం వల్ల నష్ట భయం తగ్గుతుంది. ఇది దేశంలో విలువ ఆధారిత వస్త్ర తయారీని సులభ తరం చేయటమే కాక, మన ఉతపత్తులు, ఎగుమతులను వైవిధ్య భరితంగా మారుస్తుంది. అదనంగా ఉపాధి పెరగటంతో పాటు, యూఎస్ సంస్థల నుంచి పెట్టుబ డులను ఈ ఒప్పందం ప్రోత్సహిస్తుంది.

## మలేషియాలో అగ్రశ్రేణి వ్యాపారవేత్తలతో ప్రధాని భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: మలేషియాకు చెందిన నలుగురు అగ్రశ్రేణి పారిశ్రామికవేత్తలతో ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ రోజు సమావేశమయ్యారు. పెట్రోనాస్ అధినేత, ఆ గ్రూప్ సీఈవో తాన్ శ్రీ తెంగ్కు మహమ్మద్ తౌఫిక్, బెర్జాయా కార్పొరేషన్ బెర్హాద్ వ్యవస్థాపకుడు తాన్ శ్రీ దాతో సేరి విన్సెంట్ తాన్ చీ యియున్, ఖజానా నేషనల్ బెర్హాద్ మేనేజింగ్ డైరెక్టర్ దాతో అమీరుల్ ఫైసల్ వాన్ జహీర్, ఫైసన్ ఎలక్ట్రానిక్స్ వ్యవస్థాపకుడు దాతో పువా ఖైన్ సెంగ్‌తో ఆయన భేటీ అయ్యారు.

భారత్, మలేషియా మధ్య పెరుగుతున్న వ్యాపార సంబంధాలనూ, భారత ఆర్థిక వృద్ధి గమనంపై మలేషియా కంపెనీలు చూపుతున్న అమితాసక్తిని ప్రధానమంత్రి అభినందించారు. వాణిజ్య నిర్వహణను సులభతరం చేయడానికీ, అలాగే స్థిరమైన, సమర్థమైన, పారదర్శకమైన వ్యాపార, విధానపరమైన వాతావరణాన్ని ఏర్పరిచేలా.. కొన్నేళ్లుగా భారత్‌లో చేపట్టిన సంస్కరణలు, కార్యక్రమాలను ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలు, పునరుత్పాదక ఇంధనం, డిజిటల్ సాంకేతికత, సెమీ కండక్టర్లు, కృత్రిమ మేధ, ఆరోగ్య రక్షణ వంటి రంగాలలో భారత్ అందిస్తున్న అవకాశాలను అందిపుచ్చుకోవాలని మలేషియా వ్యాపార సంస్థలను ఆయన ప్రోత్సహించారు. ఈ దిశగా 2026 ఫిబ్రవరి 07న కౌలాలంపూర్‌లో నిర్వహించిన పదో 'భారత్-మలేషియా సీఈవో ఫోరమ్' కార్యక్రమాన్ని ప్రధానమంత్రి ప్రశంసించారు. భారత్ - మలేషియా వాణిజ్య, పెట్టుబడి సంబంధాలను ఈ ఫోరంలో జరిగిన చర్చలు మరింత బలోపేతం చేస్తాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వికసిత భారత్ నిర్మాణం దిశగా భారత ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను పారిశ్రామిక ప్రముఖులు ప్రశంసించారు. వికాసం దిశగా భారత్ గమనంపై విశ్వాసం వ్యక్తం చేశారు. పెట్టుబడి పోర్ట్‌ఫోలియోలను విస్తరించడం ద్వారా, భారతీయ భాగస్వాములతో కలిసి ఉమ్మడి వ్యాపారాల్లో పాలుపంచుకోవడం ద్వారా.. భారత్‌లో తమ వ్యాపారాలను మరింత విస్తరించుకునేందుకు అమితాసక్తిని వ్యక్తం చేశారు.

## కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే..
## అభివృద్ధి చేసే బాధ్యత నాదే.. ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య



జనగామ, ఫిబ్రవరి 9 : జనగామ పట్టణం మున్సిపల్ ఎన్నికల్లో భాగంగా 20, 21,22,23 వ వార్డులలో కాంగ్రెస్ పార్టీ తరపున బరిలో నిలిపిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని,ఇట్టి వార్డులు దత్తత తీసుకొని అభివృద్ధి చేసే బాధ్యత నాదేనని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వార్డు ప్రజలను కోరారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించి ప్రజలను ఓట్లు అభ్యర్థించారు. కాంగ్రెస్ అభ్యర్థిల గెలుపుతో వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేశారు. అలాగే భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ..ఐదు వార్డుల ప్రజలు తనను ఆదరించి అభ్యర్థులను గెలిపిస్తే వార్డులలోని సమస్యలన్నీ పరిష్కరించే దిశగా ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తామన్నారు. ఈనెల 11న జరిగే ఎన్నికల్లో హస్తం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. డిసిసి అధ్యక్షురాలు లకావత్ ధనవంతి, నియోజకవర్గ ఇన్చార్జి కొమ్మూరి ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ.. గత పదివేల ప్రభుత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వం దోచుకున్న దాచుకున్న డబ్బులతో గెలుస్తామని దీమాలో ఉన్నారని, అధికారంలో లేనివారు ఏమి అభివృద్ధి చేస్తారని, బీఆర్ఎస్, బిజెపి వారిని నమ్మి మోసపోవద్దు అని వెల్లడించారు. అధికార పార్టీ అండగా ఉంది రేవంత్ రెడ్డి సమక్షంలో వారి సహకారంతో జనగామ మున్సిపల్ లోని వార్డులను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, ప్రజలందరికి నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని హామీ ఇచ్చారు. ప్రభుత్వ విప్, ఎంపీ ల సహకారం, ప్రజల మద్దతుతో వార్డు కౌన్సిలర్లు బాల్ దే మల్లేశం , గాదరి రేణుక,మోతె రేణుక , కడకంచి బాలమణి, గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో పలు వార్డుల ఇంచార్జి నాయకులు, పెద్ద ఎత్తున మహిళలు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.

## గేమింగ్ పేరుతో రూ.5 వేల కోట్ల స్కామ్.. బయటపెట్టిన పోలీసులు..

హైదరాబాద్, ఫిబ్రవరి 9: నగరంలో భారీ ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ గుట్టును పోలీసులు రట్టు చేశారు. దుబాయ్ కేంద్ర ంగా ఆన్‌లైన్ గేమింగ్ స్కామ్ జరిగినట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది. డొల్ల కంపెనీలకు రూ.5వేల కోట్లు మళ్లించినట్టు గుర్తించారు. ఫిన్‌టెక్ ప్లాట్‌ఫామ్‌లు, రెంటెడ్ బ్యాంక్ అకౌంట్ల ద్వారా ఈ అక్రమ లావాదేవీలు జరిగినట్లు తెలుస్తోంది. జీఎస్టీ ఎగవేతకు ఎస్క్రో ఖాతాలను దుర్వినియోగం చేసినట్టు పోలీసులు గుర్తించారు. ఫిన్‌టెక్ సంస్థలు, రేస్‌జీ-ఈటీ247 వంటి వెబ్‌సైట్ల ద్వారా అక్రమ దందా నడిచినట్లు బయటపడింది.

బ్యాంకింగ్ ఏపీఐలను అక్రమంగా ఉపయోగించి, ఆడిట్‌కు దొరక్కుండా నిందితులు జాగ్రత్త పడ్డారని పోలీసులు తెలిపారు. రియల్ మనీ గేమింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా భారీ మొత్తాలు షెల్ కంపెనీలకు మళ్లించినట్టు విచారణలో వెల్లడైంది. ఈ స్కామ్‌లో కీలక నిందితులుగా ఉన్న 'విగోఫిన్ డిజిటల్ సొల్యూషన్స్' డైరెక్టర్లు వైఎస్ ప్రభుకుమార్, రాజశేఖర్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వీరిద్దరినీ పోలీసులు విచారిస్తున్నారు. విచారణలో ఈ స్కామ్‌కు సంబంధించి మరిన్ని కీలక విషయాలు బయటకు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో వామపక్ష తీవ్రవాదంపై భద్రతా సమీక్షా సమావేశానికి అధ్యక్షత వహించిన కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లో ఈ రోజు వామపక్ష తీవ్రవాదం (ఎల్‌డబ్ల్యూఈ)పై నిర్వహించిన భద్రతా సమీక్షా సమావేశానికి కేంద్ర హోం, సహకార శాఖా మంత్రి అమిత్ షా అధ్యక్షత వహించారు. ఛత్తీస్‌గఢ్‌లో పలు అభివృద్ధి పనులకు సంబంధించి హోంమంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశాలకు ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి శ్రీ విష్ణు దేవ్ సాయి, ఉప ముఖ్యమంత్రి శ్రీ విజయ్ శర్మ, కేంద్ర హోం శాఖ కార్యదర్శి, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ) డైరెక్టర్, హోం మంత్రిత్వ శాఖలో ప్రత్యేక కార్యదర్శి (అంతర్గత భద్రత), ఛత్తీస్‌గఢ్ ప్రధాన కార్యదర్శి, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), నేషనల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (ఎన్ఐఏ), బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), ఇండో-టిబెట్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డైరెక్టర్ జనరల్స్, అలాగే ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, జార్ఖండ్, ఒడిశా, మహారాష్ట్ర రాష్ట్రాల హోం కార్యదర్శులు, డైరెక్టర్ జనరల్స్ ఆఫ్ పోలీస్ (డీజీఎస్‌పీలు) పాల్గొన్నారు.

సమావేశంలో కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా మాట్లాడుతూ... కేంద్రం, ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వాల భద్రతా కేంద్రిత వ్యూహం, మౌలిక సదుపాయాల కల్పన, నక్సల్స్ ఆర్థిక వనరులపై దాడులు, లొంగుబాటు విధానం వంటి చర్యలు సానుకూల ఫలితాలనిచ్చాయని అన్నారు. మార్చి 31వ తేదీలోగా నక్సలిజం నిర్మూలన పూర్తవుతుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు.

ఛత్తీస్‌గఢ్ ఒకప్పుడు నక్సల్ హింసకు కంచుకోటగా ఉండేదనీ, ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని డబుల్ ఇంజిన్ ప్రభుత్వంలో అది అభివృద్ధికి ప్రతీకగా మారిందని కేంద్ర హోంమంత్రి శ్రీ అమిత్ షా అన్నారు. ఛత్తీస్‌గఢ్ యువత తమ సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకుంటూనే క్రీడలు, ఫోరెన్సిక్ సైన్స్, సాంకేతిక విద్యా రంగాల్లో పురోగతిని వేగవంతం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు.

దేశం నుంచి నక్సలిజం ముప్పును పూర్తిగా నిర్మూలించడానికి డబుల్ ఇంజిన్ ప్రభుత్వం అన్ని విధాలా కృషి చేస్తోందని శ్రీ అమిత్ షా తెలిపారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రభుత్వ హయాంలో నక్సలిజం అంతరించిపోయే దశకు చేరుకుందనీ, 2026 మార్చి 31వ తేదీలోగా దేశం పూర్తిగా నక్సల్ రహితంగా మారుతుందని ఆయన స్పష్టం చేశారు. అనేక తరాలను పేదరికం, నిరక్షరాస్యతల చీకట్లోకి నెట్టిన నక్సలిజం నుంచి దేశానికి త్వరలోనే విముక్తి లభిస్తుందని హోంమంత్రి తెలిపారు. నక్సలైట్లకు వ్యతిరేకంగా జరుగుతున్న పోరాటం బలహీనం కాకూడదని శ్రీ అమిత్ షా అన్నారు. వివిధ రాష్ట్రాలు, కేంద్ర ఏజెన్సీల మధ్య సరైన సమన్వయం ఉండాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తూ... మిగిలిన నక్సలైట్లు ఇతర రాష్ట్రాలకు పారిపోకుండా చూడాలని ఆయన సూచించారు.

కేంద్ర హోంమంత్రి మాట్లాడుతూ... భద్రత, అభివృద్ధి రంగాల్లో ఛత్తీస్‌గఢ్ గణనీయ పురోగతిని సాధించిందని అన్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల ప్రజలకు అభివృద్ధిలో సమాన అవకాశాలు లభించేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

## కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి

**-ఓటర్లకు ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి పిలుపు**
**-పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అభివృద్ధి శూన్యం..**
**-పట్టణాన్ని అన్ని విధాలా డెవలప్ చేసే బాధ్యత నాది**

అమరావతి, ఫిబ్రవరి 9: బెల్లంపల్లి పట్టణంలోని 34 వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి కోరారు. సోమవారం ఎన్నికల ప్రచారం చివరి రోజు సందర్భంగా పలు వార్డుల్లో చేపట్టిన మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో పాల్గొని అభ్యర్థులతో కలిసి ఆయన మాట్లాడారు. మున్సిపాలిటీలోని 34 వార్డుల్లో కాంగ్రెస్ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ఆయన విస్తృతంగా పర్యటిస్తూ, గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై ఎమ్మెల్యే ప్రసంగించారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో కాంగ్రెస్ అభ్యర్థుల తరఫున నిర్వహించిన ప్రచార సభల్లో ఆయన పాల్గొని కార్యకర్తల్లో ఉత్సాహం నింపారు. ప్రచార సభల్లో ఎమ్మెల్యే వినోద్ మాట్లాడుతూ.. గత పదేళ్ల కాలంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నాయకులు బెల్లంపల్లి అభివృద్ధిని పూర్తిగా గాలికొదిలేశారని దుయ్యబట్టారు. పట్టణంలో రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని, డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. కనీస మౌలిక సదుపాయాలను కూడా పట్టించుకోకుండా, ప్రజలను ఇబ్బందులకు గురి చేసిన బీఆర్ఎస్ నాయకులకు ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. "కాంగ్రెస్ వస్తేనే బెల్లంపల్లి డెవలప్ అవుతుంది.. బీఆర్ఎస్ పాలనలో పట్టణం పదేళ్లు వెనక్కి వెళ్లింది" అని ఆయన ఘాటుగా విమర్శించారు.

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అతి తక్కువ కాలంలోనే ప్రజల సంక్షేమం కోసం అనేక మార్పులు చేపడుతోందని వినోద్ గుర్తు చేశారు. బెల్లంపల్లి పట్టణ రూపురేఖలు మారాలంటే, మున్సిపాలిటీలో కాంగ్రెస్ అభ్యర్థుల గెలుపు అనివార్యమని ఆయన స్పష్టం చేశారు. 34 వార్డుల్లోనూ కాంగ్రెస్ అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించండి.. బెల్లంపల్లిని అన్ని విధాలా అభివృద్ధి చేసి, రాష్ట్రంలోనే ఆదర్శవంతమైన మున్సిపాలిటీగా తీర్చిదిద్దే బాధ్యత నేను వ్యక్తిగతంగా తీసుకుంటాను" అని ఓటర్లకు హృదయపూర్వక హామీ ఇచ్చారు.

# వేములవాడ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం

-మాది మాటల ప్రభుత్వం కాదు చేతల ప్రభుత్వం

-ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటాం

-వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నాం

-ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9: నేటినిజం (ప్రతినిధి): వేములవాడ అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం అని,ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉంటామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ ప్రచారంలో భాగంగా సోమవారం పట్టణంలోని 01 వార్డు సంగ హన్మవ్వ, 02 వార్డు లింగంపల్లి జ్యోతి, 16 వార్డు కూరగాయలు శ్రీశైలం, 17 వార్డు అక్కి గణేష్ ,24 వార్డు అన్నారం శ్రీనివాస్,25 వార్డు కొక్కుల బాలకృష్ణ,26 వార్డు సిర్రం శిరీష,,27 వార్డు బుట్టి లావణ్య,28 వార్డు గోపన్నగారి మాధవిలత లకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు...ఆది శ్రీనివాస్ మాటాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో వేములవాడ పట్టణనికి చేసింది ఏమీ లేదని, బస్మాసుర ప్రమాణాలు చేసి మన తల పైనే అభివృద్ధి పేరుతో అప్పుల భారం మోపారని అన్నారు. వేములవాడ పట్టణంలో వందల కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని తెలిపా రు.. వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయ అభివృద్ధి కోసం ఇప్పటికే 150 కోట్ల రూపాయలు మంజూరు చేశామని,పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే పట్టణంలో సుమారు 47 కోట్ల రూపాయలతో రోడ్డు వెడల్పు పనులు చేపట్టామని, ఇది గత 50 సంవత్సరాలుగా ఎదురుచూ స్తున్న కీలకమైన అభివృద్ధి అని పేర్కొన్నారు.పట్టణ సుందరీకరణలో భాగంగా మల్లారం జంక్షన్ నుండి బతుకమ్మ తెప్ప, బ్రిడ్జి మీదు గాజగిత్యాల బస్ స్టాండ్ (సాయి రక్ష) వరకు మొత్తం 3.6 కిలోమీటర్ల పరిధిలో 146 పోల్స్‌తో సుందరీకరణ పనులకు సుమారు 2 కోట్ల 65 లక్షల రూపాయలు వెచ్చిస్తున్నట్లు తెలిపారు.జంక్షన్ల అభివృద్ధి కోసం తిప్పాపూర్ జంక్షన్ వద్ద 1 కోటి రూపాయలు మంజూరు చేయడం జరిగిందన్నారు. మున్సిపల్ శాఖ ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో నిధులు విడుదల వుతున్నా యన్నారు.మౌలిక వసతుల అభివృద్ధిలో భాగంగా పట్టణంలోని 28 వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులు పూర్తయ్యాయని, అదనంగా మరిన్ని ప్రాంతాల్లో పనుల కోసం 4 కోట్ల 20 లక్షల రూపాయలు మంజూరు చేయించామని తెలిపారు.పర్యాటక అభివృద్ధి లక్ష్యంగా టూరిజం శాఖ ద్వారా గుడి చెరువులో బోటింగ్ సౌకర్యానికి 1 కోటి 40 లక్షల రూపాయలు మంజూరు చేసినట్లు చెప్పారు. దసరా పండుగ సందర్భంగా జమ్మి చెట్టు వద్ద నడకకు ఇబ్బందులు లేకుండా 35 లక్షల రూపాయలతో పనులు చేపట్టినట్లు వివరించారు. వేములవాడ పట్టణంలోని ప్రజలు జరుగుతున్న అభివృద్ధిని గమనించి కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించి అభివృద్ధిలో పాలుపంచుకోవాలని కోరారు. వేములవాడ పట్టణంలో గంగపుత్రులు,గంగమ్మ తల్లి భక్తులు 20 ఏళ్లుగా ఎదురు చూస్తున్న బ్రిడ్జి నిర్మాణం కోసం శంకుస్థాపన చేయడం జరిగిందని తెలిపారు..బ్రిడ్జి నిర్మాణం చేయడం ద్వారా భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.

గత 25 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న షాదీఖానా నిర్మాణానికి రూ.80 లక్షల నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఒకవేళ ఈ నిధులు సరిపోకపోతే అదనపు నిధులు మంజూరు చేసే బాధ్యత తనదేనని హామీ ఇచ్చారు. గత పాలకులు కేవలం ప్రొసీడింగ్స్ ఇచ్చి పనులు చేయకుండా కాలయాపన చేశారని విమర్శించారు.తమ ప్రభుత్వం మాట ఇస్తే తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు.గత రెండు సంవత్సరాల కాలంలోనే వేములవాడ నియోజకవర్గ అభివృద్ధికి సుమారు రూ.1000 కోట్ల నిధులు తీసుకువచ్చామని, ఇది చరిత్రాత్మకమని పేర్కొన్నారు.

కులమతాలకు అతీతంగా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా దళితుల కోసం రూ.1.30 కోట్లతో అంబేద్కర్ భవన్, బీసీల కోసం రూ.1.30 కోట్లతో బీసీ భవన్, గిరిజనుల కోసం ఎస్టీ భవనాలను మంజూరు చేసినట్లు వెల్లడించారు.మురుగు నీరు గుడి చెరువులో,మూలవాగులో కలవకుండా నివారించేందుకు 10 కోట్ల రూపాయలతో ప్రత్యేక మౌలిక వసతుల పనులు కొనసాగుతున్నాయన్నారుకాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని ఏ ప్రభుత్వాలు చేయని అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ చేస్తుందని గుర్తు చేశారు. గత ప్రభుత్వం చేయని అభివృద్ధి రెండున్నర ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని ఇది చూసి ఓర్వలేకనే బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు కాంగ్రెస్ పార్టీ పైన అసత్యపు ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుతున్నారని పేర్కొన్నారు. కేటీఆర్ వేములవాడ వచ్చి నోటికి వచ్చిన మాటలు మాట్లాడారని నోరు అదుపులో పెట్టుకోవాలని తెలిపారు.. గతంలో కెసిఆర్ ఏటా రాజన్న ఆలయానికి 100 కోట్లు ఇస్తానని మోసం చేస్తే ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 150 కోట్లు కేటాయించి రాజన్న ఆలయ అభివృద్ధి పనులు ముమ్మరంగా జరిగేలా చూస్తున్నారని తెలిపారు.. రానున్న 1000 సంవత్సరాల పాటు ఉండేలా ఆలయ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. కేటీఆర్ మొన్నటి రోజున వచ్చి పాల్గొన్న మూడు మీటింగ్ ల పక్కకు చూస్తే మేము చేసిన అభివృద్ధి కనిపిస్తుందన్నారు.. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ ముందుకు పోతున్నామన్నారు.

పేదవారు ఎమ్మెల్యే గా గెలిస్తే కేటీఆర్ చూస్తూ ఓర్వలేకపోతున్నారు అన్నా రు... వీూ అయ్యా ఇచ్చిన మాట తప్పినందుకు వేములవాడ ప్రజలకు క్షమాపణ చెప్పాలని అన్నారు. వేములవాడ పట్టణంలో వందల కోట్లతో అభివృద్ధి పను లు చేపడుతున్నామని తెలిపా రు..వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు.

గతంలో వేములవాడ మున్సిపల్‌ను బిఆర్ఎస్ పార్టీకి ఇచ్చారని,అలాగే బీజేపీకి అవకాశం ఇచ్చినప్పుడు జరిగిన అభివృద్ధిని ప్రజలు గుర్తుచేసుకోవాలన్నారు.ప్రస్తుతం తనకు ఎమ్మెల్యేగా అవకాశం ఇచ్చిన రెండు సంవత్సరాల్లో జరిగిన అభివృద్ధిని ప్రజలు గమనించి, రాబోయే రోజుల్లో మరింత మెరుగైన పరిపాలన కోసం కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. అధికారంలో ఉన్నది కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం కావడంతో, వేములవాడ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ చేతుల్లో ఉంటే మరిన్ని నిధులు, మరింత అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.గతంలో బిఆర్ఎస్, బీజేపీ పాలనలతో పోల్చి,గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధిని బేరీజు వేసుకొని ఓటు వేయాలని ప్రజలను కోరారు.ప్రజలు విజ్ఞులు, చైతన్యవంతులు అని, జరుగుతున్న పరిణామాలను గమనించి తమ అమూల్యమైన ఓటును కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులకు వేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు గెలిచి, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తేనే వేములవాడ మరింత అభివృద్ధి పథంలో ముందుకు సాగుతుందన్నారు.

## 'లింగబసవేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తులు తరలిరావాలి'

నల్గొండ, ఫిబ్రవరి 9: బీబీ నగర్ మండలంలోని పడమటి సోమవారం గ్రామంలోని శ్రీ లింగబసవేశ్వర స్వామి దేవస్థానంలో బ్రహ్మోత్సవాలు ఈ నెల 11 నుండి 13 వరకు ఘనంగా జరగనున్నాయని, బ్రహ్మోత్సవాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని సర్పంచ్ బద్దం అంజయ్య కోరారు. ఈ మేరకు ఆదివారం గ్రామ పంచాయతి పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కుటుంబ సమేతంగా హాజరై భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి శ్రీ లింగబసవేశ్వర స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తంతరపల్లి ప్రదీప్ కుమార్ గౌడ్, వార్డు సభ్యులు ఆల్వ లింగారెడ్డి, ఆల్వ పుష్పమ్మ బాల్ రెడ్డి, దేశం శ్రీనివాస్ గౌడ్, దాసరి నాగలక్ష్మి కృష్ణ, నూనె అమృత రాములు, ఎండి రేష్మ ఉస్మాన్, దేవాలయ మాజీ చైర్మన్ వాకిటి బస్వారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆల్వ రవీందర్ రెడ్డి, జమ్మిగారి సత్యనారాయణ, బొమ్మగోని విజయ్ గౌడ్, గోరకంటి వేణు, నూనె భరద్వాజ్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో కేబుల్ ఆపరేటర్ మృతి

కారేపల్లి, ఫిబ్రవరి 09 : విద్యుదాఘాతంతో సింగరేణి (కారేపల్లి) మండల కేంద్రానికి చెందిన కేబుల్ ఆపరేటర్ మృతి చెందిన సంఘటన సోమవారం మధ్యాహ్నం ఇల్లెందులో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. కారేపల్లి రజక బజారుకు చెందిన జూపల్లి లాలయ్య (41) ఇల్లెందు మండలంలో కేబుల్ ఆపరేటర్ గా పని చేస్తున్నాడు. ఇల్లెందు కరెంట్ ఆఫీస్ సమీపంలో ఖమ్మం ప్రధాన రహదారి పక్కన డిష్ కేబుల్ విద్యుత్ స్తంభాల పైనుండి లాగే క్రమంలో కరెంట్ షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. లాలయ్యకు భార్య, నలుగురు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. సంఘటన స్థలాన్ని ఇల్లెందు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

## అస్సాం సీఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తాం : గౌరవ్ గొగోయ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 9: లోక్‌సభలో కాంగ్రెస్ పక్ష ఉపనేత గౌరవ్ గొగోయ్ కి, ఆయన భార్యకు పాకిస్థానీ ఏజెంట్ అలీ తౌఖీర్ షేక్ తో సంబంధాలు ఉన్నాయని అస్సాం సీఎం హిమంత బిశ్వశర్మ చేసిన ఆరోపణలపై గొగోయ్ స్పందించారు. 2013లో తన పాకిస్థాన్ పర్యటన గురించి సిట్ అధికారులు తనను ఎన్నడూ ప్రశ్నించలేదని అన్నారు.

ప్రజల మధ్యలో మతపరమైన విద్వేషాలు సృష్టించేందుకు హిమాంత శర్మ ఓ వర్గాన్ని లక్ష్యంగా చేసుకుంటున్నారని ఆరోపించారు. తన భార్య, మైనర్ పిల్లలపై అసంబద్ధమైన ఆరోపణలు చేసినందుకుగాను అస్సాం సీఎం వ్యాఖ్యలపై చట్టపరంగా ముందుకు వెళ్తామన్నారు. ఆయన మాట్లాడిన వీడియో ఆధారంగా కేసు నమోదు చేయాలని పోలీసులను కోరారు. తన భార్య ఉద్యోగ సంబంధమైన పని కోసం పాకిస్థాన్ పర్యటనకు వెళ్లిందని తెలిపారు.

## కేంద్రం పెన్షన్‌దారులకు రూ.9 వేలు పెంచాలి : పి.కృష్ణమూర్తి

హైదరాబాద్, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం పెన్షన్‌దారులకు రూ.9 వేల రూపాయలు పెంచాలని తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.కృష్ణమూర్తి అన్నారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెన్షనర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ 9, 10,11 మూడు రోజుల దేశ వ్యాప్త నిరసనలో భాగంగా సోమవారం బర్కత్‌పుర ఈపిఎఫ్ కార్యాలయం ముందు ధర్నా చేపట్టారు.

సందర్భంగా కృష్ణమూర్తి, అధ్యక్షుడు నారాయణ రెడ్డి మాట్లాడుతూ.. అర్హత కలిగిన పెన్షనర్లందరికి హయ్యర్ పెన్షన్ అమలు చేయాలని వారు కోరారు. అనంతరం పెన్షనర్స్, రిటైర్డ్ అసోసియేషన్ ప్రతినిధులు బర్కత్‌పుర ఇపిఎఫ్ కమిషనర్‌కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనార్ధన్‌రెడ్డి, బ్రహ్మాచారి, నాగేశ్వరరావు, నరహరి, సోమయ్య, పాల్గొన్నారు.

## కొబ్బరిచెట్టు పై నుంచి పడి వ్యక్తి మృతి

మల్కాజిగిరి, ఫిబ్రవరి 9 : ప్రమాదవశాత్తు కొబ్బరి చెట్టు నుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం గౌతం నగర్‌కు చెందిన శీలం బాలయేసు(33) కూలి పనులు చేస్తుంటారు. పనుల నిమిత్తం గౌతంనగర్‌లో కొబ్బరి చెట్టు కొట్టడం కోసం స్నేహితుడితో కలిసి వెళ్లాడు.పనులు చేస్తుండగా సాయంత్రం చెట్టు పైనుంచి పడిపోయినట్లు తెలిసింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించి, గాంధీ దవాఖానకు తరలించారు. అప్పటికే మృతిచెందినట్లు తెలిసింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

-ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మాట్



ఆదిలాబాద్, ఫిబ్రవరి 9: అదిలాబాద్ జిల్లా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయి లో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని ఉట్నూర్ ఐటీడీఏ పీవో యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం కార్యాలయం సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచిఅర్జీలు స్వీకరించారు.

ఉట్నూర్ మండలం శ్యాంపూర్ గ్రామానికి చెందిన దుర్గం ధర్మయ్య తనకి పట్టా మంజూరు కల్పించామని, ఇంద్రవెల్లి మండలం మార్కగూడ గ్రామానికి చెందిన దేవరావు వ్యవసాయంలో బోర్వెల్ అందించా లనికోరారు.

నార్నూర్ మండలం నార్నూర్ గ్రామానికి చెందిన సరిత తనకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కొరకు అర్జీ, ఉట్నూర్ మండలం రా మగూడ గ్రామానికి చెందిన మా రుతీరావు వికలాంగుల పింఛన్ మంజూరు చేయించాలని అర్జీ కోరారు.వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన్, ఇంది రమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశా రు. ఈ కార్యక్రమంలో ఐ టి డి ఏ ఏవో దామోదర స్వామి, గిరిజ న సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ అంబాజీ జాదవ్, ఐటీడీఏఈఈ తానాజీ జాదవ్, సంబంధిత అధికారులు, గిరిజనులు పాల్గొన్నారు.

# అలిపిరి పాదాలమండపం వద్ద ఘనంగా మెట్లపూజ



తిరుపతి, ఫిబ్రవరి 9: టీటీడీ దాససాహిత్య ప్రాజెక్టు ఆధ్వర్యంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం సోమవారం తిరుపతిలోని అలిపిరి పాదాలమండపం వద్ద వైభవంగా నిర్వహించారు. దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి పి.ఆర్. ఆనందతీర్థాచార్యులు మెట్లపూజ నిర్వహించి మెట్లపూజ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బ్రహ్మముహూర్తంలో కాలినడకన మెట్లను అధిరోహించి తిరుమల శ్రీవారిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలమన్నారు. పూర్వం పురందరదాసులు, వ్యాసరాజయతీశ్వరులు, అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి మహనీయులు భక్తిప్రపత్తులతో తిరుమల కొండలను అధిరోహించి స్వామివారి వైభవాన్ని దశదిశలా వ్యాప్తి చేశారని చెప్పారు.

అలాంటివారి అడుగుజాడలలో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలనే తలంపుతో టీటీడీ మెట్లోత్సవాన్ని నిర్వహిస్తోందని వివరించారు.

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలకు చెందిన 3 వేల మందికిపైగా భజన మండళ్ల సభ్యులు భజనలు చేసుకుంటూ తిరుమలగిరులను అధిరోహించారు.

# రామాయంపేట చౌరస్తాకు వస్తే ఎవరికి రుణమాఫీ అయిందో తేల్చుకుందాం.. రేవంత్ రెడ్డికి హరీష్ రావు సవాల్



మెదక్, ఫిబ్రవరి 9: మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీష్ రావు ఆధ్వర్యంలో చేపట్టిన భారీ రోడ్ షోకు జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు హరీష్ రావుకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్ రావు కాంగ్రెస్ పాలనపై, రేవంత్ రెడ్డి తీరుపై తీవ్రస్థాయిలో ఫైర్ అయ్యారు.

రేవంత్ రెడ్డిని చూస్తుంటే ఒక సామెత గుర్తొస్తుంది.. బొగ్గును పాలతో కడిగితే తెలుపు రాదు. అలాగే రేవంత్ రెడ్డి హార్వర్డ్ యూనివర్సిటీకి పోయినా ఆయన బుద్ధి మారలేదు, భాష మారలేదు. హార్వర్డ్ కు వెళ్లి అక్కడి పరువు తీశాడన్నారు హరీష్ రావు. నా ఎత్తు గురించి, కేటీఆర్ ఇంగ్లీష్ గురించి, పేగులు-లాగులు అంటూ మాట్లాడితే.. అవ్వాతాతల కడుపు నిండుతుందా..? నీ బూతులతో పేదోడి ఆకలి తీరుతుందా.. అని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి మామూలోడు కాదు.. ఏకంగా దేవుళ్లనే మోసం చేశాడు. పంద్రాగస్టు కల్లా రుణమాఫీ చేస్తానని ఏడుపాయల అమ్మవారి మీద, మెదక్ చర్చి ఏసుప్రభువు మీద ఒట్టేసి మాట తప్పాడు. దేవుళ్లనే మోసం చేసిన పాపాత్ముడు కాబట్టే.. అమ్మవారి కోపానికి భయపడి ఈ రోజు మెదక్ జిల్లాకు రావడానికి ముఖం చాటేశాడు.

ఈ రెండున్నరేళ్లలో ఏ ఒక్కటైనా అమలు చేశారా..

కరీంనగర్, వరంగల్ పోయిండు కానీ మెదక్ రాలేకపోయాడు. రావయ్యా రేవంత్ రెడ్డి.. పోలీసులు లేకుండా రామాయంపేట చౌరస్తాకు రా. ఎవరికి రుణమాఫీ అయ్యిందో, ఎవరికి కాలేదో ఇక్కడే తేల్చుకుందాం. నేను ఒక్కడినే వస్తా.. నువ్వు ఒక్కడివే రా..సోనియా గాంధీ, రాహుల్ గాంధీలతో బాండ్ పేపర్ల మీద సంతకాలు పెట్టించి ఆరు గ్యారెంటీలు ఇస్తామన్నారు. ఈ రెండున్నరేళ్లలో ఏ ఒక్కటైనా అమలు చేశారా.. అని హరీష్ రావు ప్రశ్నించారు. అవ్వతాతలకు రూ. 4000 పెన్షన్ ఇస్తామన్నారు.. ఇచ్చారా..ఆడబిడ్డలకు రూ. 2500, తులం బంగారం ఇస్తామన్నారు ఇచ్చారా..? రైతుబంధుకు ఎసరు పెట్టారు. బతుకమ్మ చీరలు, రంజాన్ తోఫా, కేసీఆర్ కిట్.. అన్నీ బంద్ పెట్టారు. రామాయంపేట అభివృద్ధి జరిగింది కేసీఆర్ హయాంలోనే.

రామాయంపేటకు డిగ్రీ కాలేజీ ఇచ్చింది కేసీఆర్ కాదా.. ఆర్డీవో ఆఫీస్ తెచ్చింది కేసీఆర్ కాదా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. రోడ్లు బాగు చేసి, ఇక్కడి భూముల విలువ పెంచింది బీఆర్ఎస్ ప్రభుత్వం..కాంగ్రెస్ వచ్చి రెండున్నరేళ్లయింది.. రామాయంపేటలో ఒక్క రూపాయి పని చేశారా..?కేసీఆర్ ఉన్నప్పుడు ఆటో డ్రైవర్ కు చెప్పినా యూరియా బస్తాలు ఇంటికి వచ్చేవి. ఇప్పుడు రేవంత్ రెడ్డి వచ్చాక యూరియా దొరకడమే గగనమైంది. అప్పుడు 24 గంటల కరెంట్ ఉంటే.. ఇప్పుడు 12 గంటలు కూడా సక్కగా ఇస్తలేరు. రామాయంపేటకు గుండాగిరి చేసే వాళ్లు కావాలా.. ప్రజలకు సేవ చేసే నాయకులు కావాలా.. ఆలోచించుకోండి. మా కార్యకర్తలకు నేను అండగా ఉంటా. వాళ్ల జోలికి వస్తే ఊరుకునేది లేదు. మర్యాదకు మర్యాద.. దేనికైనా సిద్ధం.. నా ఇంటికి నీ ఇల్లు ఎంత దూరమో.. నీ ఇంటికి నా ఇల్లు అంతే దూరం. గుర్తుపెట్టుకో అని హరీష్ రావు కాంగ్రెస్ నాయకులను హరీష్ రావు హెచ్చరించారు.

రామాయంపేటలో కారు గుర్తు మీద మీరు గుద్దే గుద్దుకు.. జూబ్లీహిల్స్ లో కూర్చున్న రేవంత్ రెడ్డికి గువ్వ పలగాలి. అప్పుడే కాంగ్రెస్ కు బుద్ధి వస్తుంది. రామాయంపేట అభివృద్ధి ఆగకూడదంటే కారు గుర్తుకే ఓటేయండి.

## శ్రీ నహీద బేగంను అభివృద్ధి కోసం గెలిపించండి..

మక్తల్ ఫిబ్రవరి 9: మక్తల్ మున్సిపల్ ఎన్నికల్లో అభివృద్ధి కోరుకునే వారంతా 11వ వార్డు నుండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న నహీదా బేగం ను ఆదరించి భారీ మెజారిటీతో గెలిపించాలని కాంగ్రెస్ నాయకులు మంజూర్ కోరారు. ఎన్నికల ప్రచారం చివరి రోజైన సోమవారం రోజు వార్డు పరిధిలో ఇంటింటా విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకుడు మంజూర్ మాట్లాడుతూ వార్డు పరిధిలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ప్రజల నుండి విశేష ఆదరణ లభిస్తుంది అన్నారు .ప్రజల మద్దతుతో గెలవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు

స్థానిక ఎమ్మెల్యే మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో ఈ ప్రాంతాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్న నమ్మకం ప్రజల్లో వచ్చిందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్ముతున్నారని ఎన్నికల్లో కచ్చితంగా నహీదా బేగం 11వ వార్డు కౌన్సిలర్ గా గెలవబోతున్నారని అన్నారు .వార్డు పరిధిలో సిసి రోడ్లు మురుగు కాలువలు మంచినీటి వ్యవస్థ విద్యుత్ సమస్య పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పారు. వార్డులో పూర్తి స్థాయిలో అభివృద్ధి చేపట్టి ఆదర్శ వార్డుగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యం అని అన్నారు .ప్రతిపక్షాల మాటలు నమ్మకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు . 11న జరగనున్న ఎన్నికల్లో హస్తము గుర్తుకు ఓటు వేసి నహీదా బేగంను భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నూరుద్దీన్,అబ్దుల్ రెహమాన్ ,అఫ్రోజ్ , షాబుద్దీన్, బాలరాజు,సద్దాం, యాసీన్ ,రహీం ,ఇమ్రాన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి..ఆధ్యాత్మికం..ఆదర్శం

**-అంశాలే ప్రధానంగా ప్రచారం నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్.**

**-అసెంబ్లీ, ఎంపీ ఎన్నికలకు మించి రాత్రింబవళ్లు కార్యకర్తలే గెలుపే లక్ష్యంగా పనిచేసిన కేంద్ర మంత్రి**

**-శభాష్.... సంజయన్న....అంటూ వేనోళ్ల పొగుడుతున్న కార్యకర్తలు**



కరీంనగర్,ఫిబ్రవరి 9: (నేటినిజం ప్రతినిధి) మున్సిపల్ ఎన్నికల ప్రచారం ముగిసింది. ప్రధాన రాజకీయ పార్టీల ప్రచార సరళి, ఎన్నికల ఎజెండా, అభ్యర్థుల గెలుపు కోసం వేసే ఎత్తుగడలు వంటి అంశాలను పరిశీలిస్తే..అన్నింట్లోనూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అగ్రభాగాన నిలిచారు. ఈ ఎన్నికల్లో బండి సంజయ్ ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావిస్తూ ప్రజల్లో ఆలోచన రేకెత్తిస్తూ వారిని ఆకట్టుకునేందుకు ప్రయత్నించారు. మొదటిది అభివృద్ధి నినాదం... రెండోది ఆధ్యాత్మికం కాగా మూడో అంశం ఆదర్శవంతమైన పాలన.

కరీంనగర్ కార్పొరేషన్ సహా జిల్లాలోని అన్ని మున్సి పాలిటీలన్నింటిలోనూ భారతీయ జనతా పార్టీ ప్రచారంలోనూ ముందంజలో ఉంది. ముఖ్యంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నీ తానై ప్రచారంతోపాటు అభ్యర్థుల గెలుపు బాధ్యతలను పూర్తిగా తన భుజాన వేసుకుని పనిచేశారు. ఒకవైపు ప్రచారం..మరోవైపు పార్టీ కార్యక్రమాలు...ఇంకోవైపు పోల్ మేనేజ్ మెంట్ సహా అన్నీ పనులు ఒంటి చేత్తో నిర్వర్తిస్తూ... ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు పెద్దగా కష్టం లేకుండా చేయడంలోనూ బండి సంజయ్ అగ్రభాగాన నిలిచారు. ఎన్నికల ప్రచారంలో బండి సంజయ్ ఈసారి విభిన్న రీతిలో ప్రచారం నిర్వహించారు. హిందుత్వ నినాదాన్ని ప్రధానంగా ప్రస్తావిస్తారని ప్రత్యర్థ పార్టీలు భావించారు. అందుకు భిన్నంగా పూర్తిగా అభివృద్ధి నినాదంతోనే ప్రజల్లోకి వెళ్లారు. కరీంనగర్ కార్పొరేషన్ సహా జిల్లాలోని మున్సిపాలిటీల అభివృద్ధికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధులు... కేంద్రాన్ని ఒప్పించి మెప్పించి తాను తెచ్చిన నిధులతో జరిగిన అభివృద్ధి పనులను ప్రతి మీటింగ్ లోనూ వివరిస్తూ బండి సంజయ్ మాటలకే పరిమితం కాలేదు... చేతల్లో చూపుతున్న అభివృద్ధి కాముకుడు అనే భావనను ప్రజలకు కలిగించడంలో సక్సెస్ అయ్యారు. ఇకో రెండో విషయాన్ని బండి సంజయ్ లో స్వతహాగా దైవ భక్తి, అధ్యాత్మిక చింతన ఎక్కువ. ప్రజల్లో అధ్యాత్మిక చింతన పెంపొందించాలనే ఉద్దేశంతో ఎన్నికల ప్రచారంలో ప్రతి కాలనీ, డివిజన్ లో ఎక్కడ ఆలయాలు అభివృద్ధికి నోచుకోలేదో...వాటిని అభివృద్ధి చేస్తానని మాట ఇచ్చారు. అదే సమయంలో ప్రజలు ఎక్కడ ఆలయం కావాలని కోరితే... అక్కడ నూతన ఆలయాలను నిర్మిస్తానని కూడా హామీ ఇవ్వడం గమనార్హం. ఇక మూడో విషయానికొస్తే కరీంనగర్ కార్పొరేషన్ మేయర్ తోపాటు ఆయా మున్సి పాలిటీల్లో ఛైర్మన్ పీఠాన్ని బీజేపీకి అప్పగిస్తే....అవినీతి, కబ్జాదారుల అంతు చూస్తానని, కరీంనగర్ ప్రజలకు రక్షణ కవచంగా నిలుస్తానని చెబుతూ వచ్చారు. అవినీతికి, భూకబ్జాలకు తావు లేకుండా కరీంనగర్ ను అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆదర్శవంతమైన పాలన అందించే బాధ్యత తీసుకుంటానంటూ భరోసా ఇచ్చే ప్రయత్నం చేశారు.

మొత్తంగా బండి సంజయ్ ఎంచుకున్న ఈ మూడు అంశాలు ప్రజల్లోకి విస్తృతంగా వెళ్లాయి. సంజయ్ ఎక్కడ స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించినా తండోపతండాలుగా తరలివచ్చారు. మండు టెండలోనూ ఓపికగా సంజయ్ ప్రసంగాలను ఆసక్తితో వింటూ...చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేయడం విశేషం. మరోవైపు సంజయ్ ప్రచార సరళి, ఎన్నికల ఎత్తుగడ దెబ్బకు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పూర్తిగా ఆత్మరక్షణలో పడిపోయాయి. అటు ప్రచార సరళిలో, ఇటు ఎన్నికల ఎత్తుగడలో పూర్తిగా వెనుకబడిపోయారు. ప్రధాన పార్టీల ముఖ్య నేతలు సైతం ఏం చేయాలో తెలియక నిశ్చేష్టులైపోవడం గమనార్హం. ఇక అభ్యర్థుల విషయానికొస్తే... వర్గ పోరుతో కాంగ్రెస్ అభ్యర్థుల విజయాలు పూర్తిగా దెబ్బతీసే ప్రమాదం ఏర్పడింది. ముఖ్య నేతలంతా తమ అనుచరుల గెలుపుకే పరిమితమవుతూ...ఇతర డివిజన్లలో పోటీ చేస్తున్న అభ్యర్థులనూ పట్టించుకున్న దాఖలాల్లేవు. అధికారంలో ఉన్నంత కలం పార్టీ ఫిరాయింపులకు పెద్ద పీట వేసిన బీఆర్ఎస్ పార్టీకి ఇప్పుడు ఫిరాయింపులే తలనొప్పులుగా నిలిచాయి. మున్సిపల్ ఎన్నికలకు ముందే ఆ పార్టీ నుండి పలువురు మాజీ కార్పొరేటర్లు బీజేపీలో చేరారు. ప్రస్తుతం పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థుల్లో చాలా ఎన్నికల ప్రచారంలో ఇంటింటికీ వెళుతూ... తమకు ఓటేయాలని, గెలిచిన తరువాత తాము కూడా బండి సంజయ్ సమక్షంలో బీజేపీలో చేరుతామంటూ ఓటర్లకు చెబుతూ ఓట్లను అభ్యర్థించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఇక బీజేపీ విషయానికొస్తే... అభ్యర్థుల గెలుపు బాధ్యతలను పూర్తిగా తన భుజాన వేసుకుని ఎన్నికలను ఒంటి చేత్తో నడిపించారు. పార్టీ కండువాలు, టోపీలు, కరపత్రాల సహా ప్రచార సామాగ్రి మొత్తాన్ని తానే అభ్యర్థులకు పంపించారు. పార్టీ కార్యక్రమాలకు అయ్యే ఖర్చు నంతా తానే భరించారు. బీజేపీ పక్షాన పోటీ చేసిన అభ్యర్థుల్లో 90 శాతం మంది పేద, మధ్య తరగతి వారే. రాష్ట్రంలో ఎన్నడూ అధికారంలో లేకపోవడం, పదవుల్లో కూడా లేకపోవడంతో వారి ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా ఉంది. కుటుంబ నిర్వహణే కష్టంగా ఉన్న అభ్యర్థులు కుటుంబాలు చాలా ఉన్నాయి. అలాంటి వారందరికీ ఎన్నికలకు అవసరమైన ఆర్థిక సాయాన్ని కూడా స్వయంగా బండి సంజయ్ అందించారు. కొంత మంది అభ్యర్థులకు నామినేషన్ పత్రాలకు అవసరమైన డిపాజిట్ సొమ్మును కూడా బండి సంజయ్ పంపించడం గమనార్హం. ఎన్నికల ప్రచార వ్యవధి తక్కువగా ఉండటంతో పొద్దున్నే 6 గంటలు మొదలు రాత్రి 10 గంటలదాకా వారి గెలుపు కోసం కాలికి బలపం కట్టుకుని గల్లీ గల్లీలోనూ తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తూ ఓట్లను అభ్యర్థించారు. ప్రచార సమయం ముగిసిన తరువాత సైతం పోల్ మేనేజ్ మెంట్, మరుసటి రోజు పార్టీ కార్యక్రమాల నిర్వహణపై కసరత్తు చేస్తూ ప్రతి గడప గడపకూ బీజేపీని తీసుకెళ్లడంతోపాటు ఈసారి కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు మున్సిపాలిటీల్లో బీజేపీ గెలుపు తథ్యం అనే వాతావరణం కల్పించడంలోనూ బండి సంజయ్ వందకు వంద శాతం సక్సెస్ అయ్యారని రాజకీయ విశ్లేషకులు, జర్నలిస్టు వర్గాలు చెప్పడం గమనార్హం.

ఏ విధమైన బ్యాక్ గ్రౌండ్ లేని, రాజకీయ అనుభవం లేని, పార్టీ జెండా పట్టుకుని పనిచేసిన కార్యకర్తలను పార్టీ అభ్యర్థులుగా బరిలో వారి గెలుపు కోసం బండి సంజయ్ పడుతున్న తపన, చెమటోడుస్తున్న తీరును చూసి కరీంనగర్ ప్రజలంతా "రాజకీయ నాయకులు సాధారణంగా తాము ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేసే సమయంలో మాత్రమే కార్యకర్తలను వాడుకుని ఎన్నికలయ్యాక పట్టించుకోరు. బండి సంజయ్ మాత్రం తన గెలుపు కోసం పనిచేసిన కార్యకర్త లందరినీ గుర్తు పెట్టుకుని వారికి ఒకవైపు ఆర్థిక సహకారం చేస్తూనే, మరోవైపు ఆ కార్యకర్తలను సర్పంచ్, కౌన్సలర్, కార్పొరేటర్ టిక్కెట్లు ఇవ్వడమే కాకుండా వారి గెలుపు బాధ్యతను సైతం తన భుజానా వేసుకుని రాత్రింబవళ్లు కష్టపడుతున్న తీరు అద్భుతం. కార్యకర్తలపట్ల ఇంతటి ప్రేమ, బాధ్యత కలిగిన లీడర్ ను మేము ఇంతకు ముందెన్నడూ చూడలేదు... ఇక భవిష్యత్తులోనూ చూస్తామనే నమ్మకం లేదు... శభాష్ సంజయ్"అంటూ వేనోళ్ల చర్చించుకోవడం గమనార్హం.

## ముందంజలో కాంగ్రెస్ అభ్యర్థి అనిత

**-23 వార్డు సత్యనారాయణపురంలో అనితకు ఆదరణ**

**-క్లాసు, మాసు కాంగ్రెస్ వైపే మొగ్గు**

ఖమ్మం, ఫిబ్రవరి 9 (నేటనిజం ప్రతినిధి) : ఎదులాపురం మున్సిపాలిటీ పరిధిలో 23వ వార్డు సత్యనారాయణపురం ఓటర్లు కాంగ్రెస్ అభ్యర్థి పోకబత్తిన అనితకు పట్టం గట్టటానికి సిద్ధమయ్యారు..సత్యనారాయణ పురం వార్డులో ఉన్న 1827 ఓటర్ మహాశయులు ఇప్పటికే తమ ఓటు వేసే అభ్యర్థిని నిర్ణయించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పోకబత్తిన అనితకు ఉద్యోగులు, మహిళలు, యువత మద్దతుగా నిలవడంతో గెలుపు నల్లేరుపై నడకేనని పలువురు రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

**-ఒకవైపు మాసు... మరొకవైపు క్లాస్**

ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలో ఓటర్లు ఇటు మాస్ లోను.. అటు క్లాస్ లోను ఉన్నారు. ఇందిరమ్మ కాలనీ, జంగాల కాలనీ, సత్యనారాయణపురం పరిధిలో మాస్ ఓటర్లు ఉండగా రాఘవేంద్ర నగర్, గాయత్రి నగర్, సాయి నగర్ వెంచర్లలో విద్యావంతులు, ఉద్యోగస్తులు అధిక సంఖ్యలో ఉన్నారు. మాస్ లో సాంప్రదాయ కాంగ్రెస్ ఓటర్లు ఉండగా క్లాసులో అభివృద్ధిని కాంక్షించే ఉద్యోగస్తులు , విద్యావంతులు ఉండటంతో అధికార పార్టీకి మద్దతుగా ఉందామని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది.

**-అభివృద్ధి కోసం కాంగ్రెస్ కు అండగా**

నూతనంగా ఏర్పడ్డ కాలనీల లో రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులు జరగాలంటే అధికార పార్టీకే మద్దతుగా ఉండాలనే నిర్ణయానికి ఓటర్ మహాశయులు వచ్చినట్లుగా పలు సర్వేల్లో వెల్లడైంది. సాయినగర్, రాఘవేంద్ర నగర్, గాయత్రి నగర్ తదితర ప్రాంతాలలో కొత్తగా వెంచర్లు వెలిశాయి. వందల సంఖ్యలో నూతన కుటుంబాలు ఈ ప్రాంతాల్లో సెటిల్ అయ్యాయి. వీరందరూ అధికార పార్టీకి అండగా ఉంటే తమకు అభివృద్ధి జరుగుతుందనే నిర్ణయంతో కాంగ్రెస్ అభ్యర్థి అనితకు మద్దతు పలకడానికి ముందుకు వస్తున్నారు. రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక దృష్టి ఈ మున్సిపాలిటీపై పెట్టడంతో ఇక్కడ కాంగ్రెస్ పార్టీ గెలవడం సునాయాసంగా మారిందని సర్వేలన్నీ వెల్లడిస్తున్నాయి.

# అవకాశమివ్వండి.. అభివృద్ధి చేస్తా..

**-ఆపచాంధవుడిగా ఉంటా..**

**-11 వ వార్డ్ బిజెపి అభ్యర్థి ద్వారక శ్రీదేవి శేఖర్**

**-కమలం గుర్తుపై ఓటు వేయండి..**



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9: నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 11వవార్డులో భారతీయ జనతా పార్టీ అభ్యర్థి ద్వారక శ్రీదేవి శేఖర్ దంపతులు ప్రచారంలో దూసుకుపోతున్నారు. తమకు ప్రజలు అవకాశమిస్తే అభివృద్ధి చేస్తామని11 వార్డు చివరి రోజు విస్తృతంగా గడపకు ప్రచారం చేశారు. ద్వారక శ్రీదేవి శేఖర్ మాట్లాడుతూ ఆదరించి ఆశీర్వదించి అవకాశం కల్పించాలని కోరారు.కేంద్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఒక్క అవకాశం ఇవ్వండి వార్డు అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్న, ప్రతాపరామ కృష్ణుల ఆశీర్వాదం సహాయ సహకారాలతో 11 వ వార్డును ఆదర్శవంతమైన వాడుగా తీర్చి దిద్దడమే లక్ష్యం గా పనిచేస్తానన్నారు. వార్డులో డ్రైనేజీ, సిసి రోడ్లు విద్యుత్ దీపాలు తదితర సమస్యలను పరిష్కరిస్తానన్నారు. తాగునీటి సమస్య లేకుండా కృషి చేస్తానన్నారు. భారీ మెజారిటీతో గెలిపిస్తే సేవకుడిగా సేవలు అందిస్తానన్నారు. ఆదరించి ఆశీర్వదించి గెలిపిస్తే ఆపద్బాంధవుడులా అందుబాటులో ఉంటానన్నారు.

ఈనెల 11న జరిగే ఎన్నికల్లో కమలం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరుతున్నారు.

# ఇంటింటికి విస్తృత ప్రచారం

**- చేతి గుర్తుకు పట్నం కడతామంటున్న వార్డు ప్రజలు మరోసారి ఆశీర్వదించి గెలిపిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తా**

**-14వ వార్డు అభ్యర్థి తూం మధు (సంతోష్)**



రాజన్న సిరిసిల్ల, ఫిబ్రవరి 9: నేటినిజం ప్రతినిధి): వేములవాడ మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు నుంచి తనను గెలిపిస్తే.. అందుబాటులో ఉండి సేవకుడిగా పని చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి తూం మధు (సంతోష్) ప్రజలకు భరోసా ఇస్తున్నారు. వేముల వాడ పట్టణంలోని అర్బన్ కాలనీలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా మీ ముందుకు వచ్చానని అవకాశం ఇచ్చి ఆశీర్వదిస్తే సేవకుడినై ప్రజలకు సేవలందిస్తానన్నారు. ప్రభుత్వ విప్ వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీనివాస్ ఆశీర్వాదం, సహాయ సహకారాలతో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. చేతి గుర్తుకు ఓటేసి భారీ మెజారిటీతో గెలిపిస్తే అర్బన్ కాలనీ లో ఆంజనేయ స్వామి ఆలయాన్ని నిర్మిస్తానని హామీ ఇచ్చారు. కాలనీలో " తాగునీటి కష్టాలు తీర్చేందుకు నాలుగు బోరు బావులను వేయిస్తానన్నారు. పేద ప్రజలకు అత్యవసర సమయాల్లో సేవకుడిగా అందుబాటులో ఉంటారన్నారు. 14 వ వార్డులో డ్రైనేజీ సిసి రోడ్లు వీధి దీపాలు తదితర అభివృద్ధి పనులను ముందుకు తీసు కెళ్తానన్నారు. మైనార్టీ సోదరులకు ప్రభుత్వం అందించే ప్రత్యేక పథకాలను అంది ంచేందుకు కృషి చేస్తానన్నారు. అర్బన్ కాలనీలోని బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు. ఈనెల 11న జరిగే ఎన్నికల్లో చేతి గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రజల మద్దతుతో గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు.

# కర్ల రాజేశ్ కేసును నీరుగార్చే ప్రయత్నం జరుగుతోంది : మందకృష్ణ మాదిగ



హైదరాబాద్, ఫిబ్రవరి 9: లాకప్ డెత్ మృతుడు కర్ల రాజేశ్ కేసును పోలీసు ఉన్నతాధికారులు, పాలకులు నీరుగార్చే ప్రయత్నం చేస్తున్నారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ ఆరోపించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్ లో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 90 రోజులుగా ఈ కేసులో పురోగతి రావడం లేదని, బాధిత కుటుంబా నికి న్యాయం జరుగడం లేదన్నా రు. నాడు అక్రమ నిర్బంధం, చిత్రహింసలపై నోరు మెదపని అధికారులు ఆయన మరణానికి తాము కారణం కాదని, గుండెపో టుతో చనిపోయాడని పోస్టు మార్ట ం రిపోర్టుగ తయారు చేయించే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ రిపోర్టు ఇంకా పెండింగ్‌లో ఉండగా, గుండెపోటుతో చనిపోయారని ఎలా చెబుతారని ప్రశ్నించారు.


ఇప్పటి వరకు మానవ హక్కుల కమిషన్, హైకోర్టుకు నుంచి వివరణ ఇవ్వలేదన్నారు. రాజేశ్ మృతదేహానికి పోస్టుమార్టం చేసిన డాక్టర్, దానిని చిత్రీకరించిన వీడియోగ్రాఫర్‌పై అనుమానం ఉందన్నారు. జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిసి వివరించిన తర్వాత డిసెంబర్ 18న రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ, డీజీపికి నోటీసులు పంపించారన్నారు. కర్ల రాజేశ్‌ను అరెస్టు చేయకముందు ఆయన సంపూర్ణ ఆరోగ్యవంతుడని నివేదికలు వచ్చాయని, అలాంటి వ్యక్తి గుండె పోటుతో చనిపోయాడని నమ్మించి కేసును నీరు గార్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. బీబీనగర్ ఏయిమ్స్ వైద్యులు, నిపుణులైన ఫోరెన్సిక్ నిపుణుల సమక్షంలో రిపోస్టుమార్టం చేయించాలని డిమాండ్ చేశారు.జాతీయ ఎస్సీ కమిషన్ పది రోజుల్లో నివేదిక పంపించమని అడిగితే, సంఘటన జరిగి 80 రోజులు, నోటీసులు పంపి 50 రోజులు గడిచిపోయినా ఇంత వరకు డీజీపీ, చీఫ్ సెక్రటరీ ఎందుకు స్పందించడం లేదని, రిపోస్టుమార్గానికి ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. ఒక జాతీయ ఎస్సీ కమిషన్ సూచనలను పోలీసు శాఖ పట్టించుకోవడం లేదన్నారు. రీపోస్టుమార్టంకు ప్రత్యక్షంగా అడ్డుపడుతున్నది సూర్యపేట జిల్లా ఎస్సీ నర్సింహా అయితే, ఆయనపై ఒత్తిడి తీసుకువస్తున్నది మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే పద్మావతి రెడ్డిలని ఆరోపిం చారు.

ఒక అగ్రవర్ణ మహిళ రైలు కింద పడి ఆత్మహత్య చేసుకుంటే సీసీ ఫుటేజీలు వస్తున్నాయని, పోలీసులు ప్రతి కేసును సీసీ ఫుటేజీ ఆదారంగానే దర్యాప్తు చేస్తున్నారని, కాని ఒక దళిత వర్గానికి చెందిన రాజేశ్ మృతిపై మాత్రం సీసీ ఫుటేజీలు దొరకడం లేదా అని ప్రశ్నించారు. ప్రస్తుత ఎస్పీ సాక్షాలను మాయం చేసే ప్రయత్నం చేస్తున్నారని, సీసీ ఫుటేజీలను దాచి పెట్టే చర్యలు చేస్తున్నారని ఆరోపించారు.గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మరియమ్మ లాకప్ డెత్ విషయంలో నాటి సీఎం కేసీఆర్ స్పందించిన తీరును అభినందించాల్సిందేనన్నారు. అక్కడ పోలీసుల తప్పిదమని తేలిపోయిన వెంటనే దళితులపై చేయి పడితే ఊరుకోమని కేసీఆర్ బహిరంగ ప్రకటన చేశారని, పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారన్నారు. పది రోజుల వ్యవధిలో మరియమ్మ కుమారుడికి ప్రభుత్వ ఉద్యోగం, ఇళ్లు, రూ.15లక్షలు పరిహారం, ఇద్దరు కుమార్తెలకు రూ.10లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించి బాధిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేశారని ప్రశంసించారు. బాధ్యులైన పోలీసు అధికారులపై చర్యలు తీసుకున్నారని, సస్పెండ్, డిస్మిస్‌లు చేశారని, గుర్తు చేశారు.

ఒక దళితుడు చనిపోయి 80 రోజులు గడిచినా ముఖ్యమంత్రి, హోం మంత్రిగా ఉన్న రేవంత్ రెడ్డి స్పందించకపోవడం అత్యంత శోచనీయమన్నారు. ఓ వైపు పోలీసు శాఖ నీరు గార్చే ప్రయత్నం చేస్తుండగా, మరో వైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిన్నకుండడం వెనుక అంతర్యమేమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ఇంతా జరుగుతున్నా సీఎం నిద్రపోతున్నాడా, లేని నిద్రపోతున్నట్లు నడిస్తున్నాడా అనే అనుమానం కలుగుతుందన్నారు. రాజేశ్ కుటుంబానికి న్యాయం జరిగేంత వరకు విశ్రమించేది లేదని, త్వరలోనే జాతీయ ఎస్సీ కమిషన్ ను మళ్లీ కలుస్తామని, పోలీసుల చర్యలను ఆదారాలతో బయటపెడుతామన్నారు. రిపోస్టుమార్టం చేసి నిజ నిజాలు బయటకు వచ్చే వరకు తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

# టీఎస్ఎస్ఏ క్యాలెండర్ ఆవిష్కరణ

**-నేటి యువత సామాజిక బాధ్యతతో ముందుకు సాగాలి: మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అఘస్త్యన్**



ఖమ్మం, ఫిబ్రవరి 9 (నేటి నిజం ప్రతినిధి) : తెలంగాణ సోషలిస్టు స్టూడెంట్ అసోసియేషన్ (టీఎస్ఎస్ఏ) నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఖమ్మం మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అఘస్త్యన్‌తో పాటు జిల్లా స్థాయి అధికారులు సంయుక్తంగా ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ అభిషేక్ అఘస్త్యన్ మాట్లాడుతూ... నేటి యువత సామాజిక స్పృహతో మెలిగి దేశానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. విద్యార్థులు చదువులో నిరంతరం రాణిస్తూ ఉన్నత విద్యను అభ్యసించి మంచి అవకాశాలు అందుకోవాలని సూచించారు. విద్యార్థుల సమస్యల పరిష్కారానికి టీఎస్ఎస్ఏ చేస్తున్న ఉద్యమాలు అభినందనీయమని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న విద్యా, సంక్షేమ పథకాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా అధికారులు మాట్లాడుతూ... విద్యార్థి సంఘాలు సమాజ హితాన్ని దృష్టిలో పెట్టుకొని బాధ్యతాయుతంగా పనిచేయడం శుభపరిణామమని తెలిపారు. దళిత, గిరిజన, బీసీ, మైనారిటీ విద్యార్థుల హక్కుల పరిరక్షణ, వసతి గృహాల అభివృద్ధి, విద్యా సౌకర్యాల మెరుగుదల కోసం టీఎస్ఎస్ఏ చేపడుతున్న కార్యక్రమాలకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు. టీఎస్ఎస్ఏ క్యాలెండర్ విద్యార్థి ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలవడంతో పాటు, రానున్న కాలంలో చేపట్టబోయే రాష్ట్రవ్యాప్త కార్యక్రమాలకు దిశానిర్దేశం చేస్తుందని టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామాల సత్యం తెలిపారు. విద్యార్థుల ఫీజుల సమస్యలు, వసతి గృహాల మౌలిక వసతులు, హక్కుల పరిరక్షణ కోసం అవసరమైతే రాష్ట్రవ్యాప్త ఉద్యమాలకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ ఎన్. విజయలక్ష్మి, మైనింగ్ డైరెక్టర్ సాయినాథ్, రమేష్, తిరుమలరావు, శ్రీనివాస్, టీఎస్ఎస్ఏ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దమల్ల సత్యం, వరద సాయి తదితరులు పాల్గొని క్యాలెండర్ ఆవిష్కరణలో భాగస్వాములయ్యారు.

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com